

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | మంగళవారం | 14.04.2026 | సంపుటి: 3 | సంచిక: 73 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | TUESDAY | 14.04.2026 | VOLUME : 3 | ISSUE : 73 | PAGES: 8 | COST: 2/- |



## విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575




## మహిళా కోటాతో
# ముడిపెట్టవద్దు

- డీ లిమిటేషన్‌పై సమిష్టిగా చర్చించాల్సిందే
- ఎక్స్ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి సూచన



హైదరాబాద్, ఏప్రిల్ 13: అసెంబ్లీ సీట్లలో మహిళా కోటా వెంటనే అమలు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ పేరుతో

మిగతా 3వ పేజీలో..

## శ్రీపాదరావుకు సీఎం రేవంత్ నివాళి 3

## కొత్త దిక్సూచి
# 'భూ భారతి'



- చరిత్రాత్మక చట్టానికి నేటితో ఏడాది పూర్తి
- 5.20 కోట్లమందికిపైగా పోర్టల్ సందర్శన
- 70 లక్షలమంది లాగిన్
- 3.80 లక్షల మందికి పాస్‌బుక్‌లు జారీ
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

హైదరాబాద్, ఏప్రిల్ 13 : బీఆర్ఎస్ ప్రభుత్వంలో కుప్పకూలిన రెవెన్యూ వ్యవస్థను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పునర్నిర్మిస్తున్నామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భూహక్కుల పరిరక్షణ, పారదర్శకత, అవినీతి రహిత సేవలు సామాన్యుడికి సులభంగా అందేలా గత ఏడాది తీసుకొచ్చిన భూభారతి చట్టం రాష్ట్ర చరిత్రలో కీలక సంస్కరణగా నిలుస్తుందన్నారు. ఈనెల 14తో భూభారతి అమలులోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా తన కార్యాలయంలో

మిగతా 2వ పేజీలో..

# గాలి మోటార్లలో సీఎం, మంత్రుల టూర్లు

- ఎవరికీ పట్టని రైతుల కష్టాలు
- ప్రతి గింజనూ మద్దతు ధరకు కొనాల్సిందే
- బీఆర్ఎస్ నేత హరీశ్ రావు డిమాండ్

సదాశివపేట, ఏప్రిల్ 13: కోటా సాకుతో శనగలు, మక్కలు, జొన్నల కొనుగోళ్లు నిలిపివేసి రైతులను నిలువునా ముంచుతున్నారని అసెంబ్లీలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు ఆరోపించారు. సదాశివపేట రైతు సేవా కేంద్రంలోని శనగల కొనుగోలు కేంద్రాన్ని ఆయన సోమవారం సందర్శించారు. కోటా అయిపోయిందంటూ కొనుగోళ్లు నిలిపివేయడంతో వారం రోజులుగా అక్కడే పడిగాపులు కాస్తున్న రైతుల

మిగతా 3వ పేజీలో..



## టెట్ నోటిఫికేషన్ విడుదల

- ఏప్రిల్ 15 నుంచి దరఖాస్తులు ప్రారంభం
- 30 వరకు టెట్ ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ
- జూన్ 9 నుంచి టెట్ హాల్‌టికెట్లు జారీ
- జూన్ 15 నుంచి 30 వరకు పరీక్షలు


3

## సైబర్ నేరాల్లో
# రికవరీ అంతంతే

- సొమ్ము పోయిందా తిరిగి రావడం కష్టమే
- తెలంగాణలో రోజుకో తరహాలో సైబర్ మోసాలు
- వెల్లడించిన తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో



2





# మరోమారు ఎదురు కాల్పులు

4

- మహిళా మావోయిస్టు నాయకురాలు మృతి
- అడవుల్లో కొనసాగుతున్న కూంబింగ్

## మూసీ అభివృద్ధిలో
# భాగస్వాములను చేయండి

ఉప ముఖ్యమంత్రికి మధు పార్క్ రిడ్జ్ నిర్వాసితుల వినతిపత్రం



3



2

ప్రమాదాలు తగ్గించేందుకు
## అరైవ్ అలైవ్

- 18వరకు రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు
- పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి పొన్నం

# కేసీఆర్‌కు మంత్రి సీతక్క లీగల్ నోటీసు

- మొబైల్ ఫోన్ల విషయంలో ఆరోపణలు నిరాధారం
- 48 గంటల్లో క్షమాపణ చెప్పాలి
- లేకుంటే సివిల్, క్రిమినల్ చర్యలు తప్పవు



హైదరాబాద్, ఏప్రిల్ 13: అంగన్‌వాడి మొబైల్ ఫోన్ల కొనుగోలు విషయంలో నిరాధార ఆరోపణలు చేస్తూ తన ప్రతిష్టను దెబ్బతీసేలా బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ

మిగతా 2వ పేజీలో..

మహిళా రిజర్వేషన్లపై
# విమర్శలు తగవు

- ప్రతి ఒక్కరూ స్వాగతించాల్సిందే
- డీలిమిటేషన్‌తో ఎవరికీ అన్యాయం జరగదు
- సిఎం రేవంత్ వ్యాఖ్యల పై బీజేపీ ఎంపీ డీకే అరుణ



2

## విదేశాల్లో ఖాతాదారుడు

- రూ.6.5 కోట్లు కొట్టేసిన బ్యాంక్ మేనేజర్
- ఎట్టకేలకు అరెస్ట్

వివరాలు 4వ పేజీలో..



3

ఆర్టీసీలో మోగిన
## సమ్మె సైరన్

- 22 నుంచి సమ్మెకు వెళ్తున్నట్లు జేఏసీ ప్రకటన
- ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్

వికసిత భారత్ లక్ష్య సాధనలో
# మినరల్స్ కూడా కీలకమే

- మినరల్ రంగంలో ఆత్మనిర్భరత భారత్‌పై ప్రత్యేక దృష్టి
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి



2



వచ్చే విద్యా సంవత్సరానికి
# డిగ్రీ ప్రవేశాలు

- 15 నుంచి సీట్ల భర్తీకి తొలివిడత ప్రక్రియ
- తెలంగాణలో దోస్త్ నోటిఫికేషన్ విడుదల

2



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 130 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 157 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 228 (కిలో) |
| స్కిన్ లెస్ | 259 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹66



## ప్రమాదాలు తగ్గించేందుకు
# ‘అరైవ్ అలైవ్’

- 18వరకు రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు
- పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి పొన్నం

**హైదరాబాద్, ఏప్రిల్ 13 :**
రవాణా శాఖ నిబంధనలు ప్రచారం చేసి రోడ్డు ప్రమాదాలను తగ్గించే చర్యలు తీసుకోవడానికి అరైవ్ అలైవ్ కార్యక్రమం చేపట్టామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా అరైవ్అలైవ్ కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను ఖైరతాబాద్‌లోని రవాణా శాఖ కార్యాలయంలో ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సోమవారం నుంచి 18వ తేదీ వరకు రోడ్ సేఫ్టీ కోసం పోలీస్, రవాణా శాఖ అరైవ్ అలైవ్ కార్యక్రమం చేపడుతున్నట్లు, పర్యావరణ పరిరక్షణ కోసం రవాణా శాఖ చర్యలు తీసుకుంటున్నదని, ట్రాఫిక్ నిబంధనల అమలుకు కఠిన చర్యలు తీసుకుంటుందని, ఈ ఆరు రోజుల్లో అన్ని జిల్లాల్లో శాఖాపరంగా సమీక్షలు చేయనున్నట్లు చెప్పారు. ప్రమాదాల నివారణ, ప్రాణ నష్టం లేకుండా చూడటమే కార్యక్రమ లక్ష్యమన్నారు. ప్రమాదం జరిగిన గంట(గోల్డెన్ అవర్)లో హాస్పిటల్‌లో బాధితుడిని హాస్పిటల్‌లో చేర్పిస్తే రహవీర్ అవార్డు ఇస్తారన్నారు. చెక్ పోస్టులు ఎత్తివేసి సంస్కరణలు తీసుకొచ్చామని, అన్ని స్కూళ్ళలో విద్యార్థులకు రవాణా నిబంధనలు వివరించేలా చర్యలు తీసుకుంటున్నామని, ఆర్టీసీలో 30 ఏళ్ల సర్వీసులో ఉండి ఒక్క యాక్సిడెంట్ కూడా చేయని వారికి సన్మానం చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పొన్నం తెలిపారు. రోడ్ సేఫ్టీ సమావేశాలు ప్రతీ జిల్లాలో నిర్వహించాలని ఆదేశించారు.

**ఆర్టీసీ విలీనం అంశం కమిటీ దగ్గర ఉన్నది**
కాగా, ఆర్టీసీలో సమ్మె విషయంపై మాట్లాడుతూ ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం అంశం కమిటీ దగ్గర ఉన్నదని, రెండు సమస్యలపై మినహా మిగతా అంశాలపై చర్చించడానికి సిద్ధమని తెలిపారు. సిబ్బందికి సంబధించిన అంశాలు పరిస్కరిస్తామన్నారు. ప్రేరేపిత సమ్మెలకు వెళ్ళవద్దని, పెండింగ్ డీఏ ఇచ్చాం.. పీఆర్‌సీపై ఆలోచిస్తున్నాం అని మంత్రి పొన్నం చెప్పారు. కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, జేటీసీలు చంద్రశేఖర్ గౌడ్, రమేష్, శివ లింగయ్య, ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

## వికసిత భారత్ లక్ష్య సాధనలో
# మినరల్స్ కూడా కీలకమే

- మినరల్ రంగంలో ఆత్మనిర్భరత భారత్‌పై ప్రత్యేక దృష్టి
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్, ఏప్రిల్ 13:**
ప్రపంచవ్యాప్తంగా క్రిటికల్ మినరల్స్ ప్రాముఖ్యం పెరుగుతోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. 2047 వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించడంలో మినరల్స్ కీలకమని చెప్పుకొచ్చారు. మినరల్ రంగంలో ఆత్మనిర్భరత సాధించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు కిషన్ రెడ్డి తెలిపారు. సోమవారం హెచ్ఐసీసీలో భారత ప్రభుత్వ గనుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2వ విడత ఎక్స్‌ప్లోరేషన్ లైసెన్స్ వేలం, 7వ విడత క్రిటికల్ / స్ట్రాటజిక్ మినరల్ బ్లాక్స్ వేలం కార్యక్రమానికి కేంద్ర మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. జియోపాలిటిక్స్, క్లైమేట్ మార్పు, ఆర్థిక భద్రతలో ఈ మినరల్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. ఇప్పటివరకు 46 బ్లాక్స్ వేలం విజయవంతంగా పూర్తి చేశామని కేంద్ర మంత్రి వెల్లడించారు. 7వ విడతలో 19 బ్లాక్స్‌ల వేలం ప్రారంభమైందన్నారు. మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ లైసెన్స్ మొదటి విడత ప్రారంభమైందని.. త్వరలోనే 11 బ్లాక్స్‌లకు రెండో విడత లైసెన్స్ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణలో 2 వెనేడియం, టైటానియం బ్లాక్స్ సిద్ధం చేసినట్లు మంత్రి ప్రకటించారు. మైనింగ్ కార్యకలాపాలను వేగవంతం చేయడం కోసం చట్టాల్లో మార్పులు తీసుకొస్తున్నామని చెప్పారు. రాష్ట్రాలు స్వతంత్రంగా వేలం నిర్వహించే అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. పర్యావరణ అనుమతుల ప్రక్రియను సరళీకరించడం, 24 మినరల్స్‌పై కస్టమ్స్ డ్యూటీ రద్దు చేయడం, త్వరగా ఉత్పత్తి ప్రారంభించే కంపెనీలకు ప్రోత్సాహకాలు అందించడం వంటి చర్యలు తీసుకోనున్నట్లు కిషన్ రెడ్డి వివరించారు. స్క్రాప్ నుంచి మినరల్స్ రీసైక్లింగ్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. విదేశాల్లో మైనింగ్ ప్రయత్నాలు చేపట్టామని తెలిపారు. రక్షణ రంగం, ఎలక్ట్రిక్ వెహికల్స్, గ్రీన్ ఎనర్జీకి క్రిటికల్ మినరల్స్ కీలకమని.. ప్రైవేట్ సంస్థలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. భారత్‌ను గ్లోబల్ మైనింగ్ లీడర్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.



# వచ్చే విద్యాసంవత్సరానికి డిగ్రీ ప్రవేశాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 13:**
రాష్ట్రంలో వచ్చే విద్యా సంవత్సరం 2026`27లో ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో సీట్ల భర్తీకి నిర్వహించే దోస్త్ నోటిఫికేషన్‌ను తెలంగాణ ఉన్నత విద్యామండలి విడుదల చేసింది. ఈనెల 15వ తేదీ నుంచి మే 7వ తేదీ వరకు తొలి విడతలో సీట్ల భర్తీ పక్రియ కొనసాగుతుంది. అర్హులైన విద్యార్థులు రూ.200 రిజిస్టేషన్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. ఏప్రిల్ 30వ తేదీ నుంచి మే 8వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. ఒక మే 14వ తేదీన తొలి దశ సీట్ల కేటాయింపు జరగనుంది. సీట్ల కేటాయింపు అనంతరం ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. ఇక రెండో దశ సీట్ల రిజిస్ట్రేషన్ పక్రియ మే 15వ తేదీ నుంచి మే 25వ తేదీ వరకు కొనసాగనుంది. మే 15వ తేదీ నుంచి మే 26వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. మే 30వ తేదీ సీట్లు కేటాయిస్తారు. మూడో విడత రిజిస్ట్రేషన్ పక్రియ మే 31వ తేదీ నుంచి జూన్ 15వ తేదీ వరకు జరగనుంది. జూన్ 16వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. జూన్ 20వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుంది. రెండో, మూడో విడత సీట్ల కేటాయింపు అనంతరం కూడా ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. సీట్లు పొందిన విద్యార్థులు ఆయా కాలేజీల్లో జూన్ 20 నుంచి 27వ తేదీ మధ్యలో హాజరై అడ్మిషన్ పక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. జూన్ 29, 30వ తేదీల్లో ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తారు. జూలై 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

# కొత్త దిక్సూచి ‘భూ భారతి’

**మొదటిపేజీ తరువాయి**

అధికారులతో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది ఒక చట్టానికి ఏడాది పూర్తయిన సందర్భం మాత్రమే కాదని, రాష్ట్రంలో భూ హక్కుల రక్షణకు కొత్త శకానికి నాందిపలికిన రోజు అని వ్యాఖ్యానించారు. ‘భూ భారతి’కి ముందు, ఆ తర్వాత ఉన్న పరిస్థితులపై చర్చించారు. ఈ చట్టం తీసుకొచ్చే నాటికి ధరణి పోర్టల్ వల్ల ప్రజానీకం ఎదుర్కొన్న పరిస్థితులను మంత్రి గుర్తు చేశారు. నాటి పరిస్థితిని పూర్తిగా మార్చాలన్న సంకల్పంతో పారదర్శకత, బాధ్యతాయుత, వేగం అనే మూడు ప్రధాన సూత్రాలతో రెవెన్యూ వ్యవస్థను ప్రజలకు చేరువ చేస్తున్నామని చెప్పారు. ఈ క్రమంలోనే చరిత్రాత్మకమైన భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని, ఈ చట్టం రాష్ట్రంలోని భూ పరిపాలనను పారదర్శకంగా సులభంగా మార్చిందని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో సరైన విధివిధానాలు లేకుండా తీసుకొచ్చిన 2020 ఆర్వోఆర్ చట్టం, ధరణి పోర్టల్ వల్ల లక్షలాదిమంది ప్రజలు తమ భూముల హక్కుల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. భూమి తమదే అయినప్పటికీ హక్కులను నిరూపించుకునేందుకు అధికారుల, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని, ఆనాటి పరిస్థితులను చూసి అధికారంలోకి వచ్చిన వెంటనే ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలుపుతామని ఇచ్చిన మాటను నిలబెట్టుకుని గత ఏడాది ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి రోజున



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా భూభారతి పోర్టల్‌ను ఆవిష్కరించామని చెప్పారు. రైతాంగానికి భూ భద్రత కల్పించడంలో భూభారతి ఒక బలమైన ఆయుధంగా మారిందన్నారు. భూ వివాదాలకు చరమగీతం పాడుతూ సామాన్యుడికి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే తిప్పలు తగ్గించడంలో ఈ ఏడాది కాలం ఒక గొప్ప ముందడుగుగా నిలిచిందన్నారు. భూభారతి పోర్టల్ పాత చిక్కుముడులను విప్పడంలో కీలక పాత్ర పోషించిందని, ఈ పోర్టల్ ప్రారంభించిన ఏడాదిలోపే 5.20 కోట్లకుపైగా ప్రజలు దీన్ని సందర్శించారని, సుమారు 67 లక్షల మంది పోర్టల్ ద్వారా లాగిన్ అయ్యారని తెలిపారు. రైతులకు పారదర్శకంగా సులభతరమైన సేవలందించేందుకు రెవెన్యూ, సర్వే, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎనఐసితో కలిసి రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను ఈనెల 2నుంచి ఐదు జిల్లాల్లోని ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభిమని మంత్రి పొంగులేటి వివరించారు. ఇక్కడ ఎదురయ్యే మంచి చెడులను పరిగణనలోకి తీసుకొని అవసరమైన మార్పులు చేర్పులు చేసి వచ్చే నెలలో జిల్లాకు ఒక మండలంలో ప్రారంభిస్తామని, ఈ ఐదు మండలాల్లో కూడా ప్రతి సర్వే నెంబరుకు భూధార్ నెంబర్‌ను కేటాయిస్తామని చెప్పారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న సంకల్పంతో తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

నిజాం కాలం నుంచి 378 గ్రామాలను నక్షాలు లేవు. ఇందులో ఐదు గ్రామాలలో రీ సర్వే పూర్తి చేసి భూదార్ నెంబర్ కేటాయించామని, మిగిలిన 373 గ్రామాల్లో రోవర్స్ వంటి ఆధునిక సర్వే సాంకేతికతను ఉపయోగించి రీ సర్వే పనులు కొనసాగిస్తున్నామని, జిల్లాకు 70 రెవెన్యూ గ్రామాలను గుర్తించి సర్వే చేపట్టబోతున్నామని, సర్వే అనంతరం హద్దులను గుర్తించి భూధార్ నెంబర్ ఇస్తామని కూడా వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా ఇలా సర్వే నిర్వహించాలని నిర్ణయించామన్నారు. రాష్ట్రంలో 1948 నాటికి సుమారు 40 లక్షల సర్వే నెంబర్లు వినియోగంలో ఉండగా అప్పటినుంచి ఈ 77 సంవత్సరాలలో 2.29కోట్లకు చేరాయని, వీటన్నింటికీ భూధార్ నెంబర్ ఇవ్వడానికి ప్రణాళికలు తయారు చేస్తున్నామని చెప్పారు. భూ సర్వేకు అవసరమైన సిబ్బందిని సమకూర్చుకున్నామని, శిక్షణ ఇచ్చి 5,520మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లకు లైసెన్స్‌లు జారీ చేశామని, భూ విస్తీర్ణాన్నిబట్టి ప్రతి మండలానికి నలుగురి నుంచి ఆరుగురు సర్వేయర్లను నియమించామని చెప్పారు. రాష్ట్రంలోని 10,984 రెవెన్యూ గ్రామాలను క్లస్టర్లుగా విభజించి జీపీవోలను నియమించామని, గొలుసులు, కర్రలు, క్రాస్ స్టాఫ్, మెజరింగ్ టేప్ వంటి పాత సర్వే పరికరాలకు స్వస్తి చెప్పి అత్యాధునిక యంత్రాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటున్నామని అన్నారు. ఇప్పటికే 411 రోవర్లను కొనుగోలు చేశామని, త్వరలో మరో 400 కొనుగోలు చేయబోతున్నామని, భూ భారతి పోర్టల్ ప్రారంభించిన గత ఏడాది ఏప్రిల్ 14 నుంచి ఇప్పటివరకు 3.80 లక్షల పాస్ బుక్‌లు జారీ చేశామని మంత్రి పొంగులేటి వివరించారు.

# కేసీఆర్‌కు మంత్రి సీతక్క లీగల్ నోటీసు

**మొదటిపేజీ తరువాయి**

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకు లీగల్ నోటీసు పంపించారు. మంత్రి తరపున అడ్వకేట్ నాగులూరి కృష్ణకుమార్ రిజిస్టర్డ్ పోస్టు ద్వారా ఈ నోటీసు పంపించారు. నోటీసులో అంగన్‌వాడి మొబైల్ ఫోన్ల కొనుగోలు ప్రక్రియను తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ (టీజీటీఎస్) నిర్వహించిందని, కమిటీ నిర్ణయాల ప్రకారం సరఫరాకు ఒప్పందం చేసుకున్నారని, ఇందులో తన ప్రమేయం లేదని మంత్రి స్పష్టం చేశారు. అయినప్పటికీ తన ప్రతిష్టను దెబ్బతీసేలా కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మొత్తం టెండర్ విలువ రూ.44.42 కోట్లే ఉన్నప్పటికీ రూ.30 కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించడం అసంబద్ధమని, ఇది పూర్తిగా ఆధారాలు లేని ఆరోపణ అని మంత్రి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఒక్కో మొబైల్ ఫోన్‌ను రూ.11,650కే కొనుగోలు చేశామని, ఇతర రాష్ట్రాల కంటే తక్కువ ధరకు టీజీటీఎస్ ద్వారా కొనుగోలు చేసినట్టు తెలిపారు. అంగన్‌వాడి మొబైల్ ఫోన్ల కొనుగోలుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ సూచనల మేరకే టెండర్ ప్రక్రియ పూర్తయ్యిందని మంత్రి వివరించారు. బీఆర్ఎస్ అధికారిక సోషల్ మీడియా వేదికల్లో జరుగుతున్న దుష్ప్రచారానికి పార్టీ అధినేతగా కేసీఆర్ బాధ్యత వహించాలని మంత్రి డిమాండ్ చేశారు. ఈ మేరకు 48 గంటల్లో సోషల్ మీడియా పోస్టులను తొలగించి పార్టీ, కేసీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. అనంతరం ప్రజా భవన్‌లో మీడియాతో మాట్లాడిన మంత్రి సీతక్క అంగన్‌వాడీలకు మొబైల్స్ కొనుగోలు విషయంలో బీఆరఎస్ పదేపదే తప్పుడు ఆరోపణలు చేస్తోందని అన్నారు. వ్యక్తిగతంగా ఎవరైనా ఆరోపణలు చేస్తే పట్టించుకోవాల్సిన అవసరం లేదని, కానీ అవాస్తవాలను పార్టీ అధికారిక సోషల్ మీడియా వేదికల్లో ప్రచారం చేయడం వల్లే ఆ పార్టీ అధినేత కేసీఆర్‌కు లీగల్ నోటీసు ఇవ్వాల్సి వచ్చిందని తెలిపారు. పార్టీ అధినేతగా కేసీఆర్ బాధ్యత



తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. గతంలో కూడా ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేసినప్పుడు తాను కేసీఆర్‌కు లీగల్ నోటీసు పంపించినట్టు గుర్తుచేశారు. ‘తప్పును పదిసార్లు చెబితే నిజం కాదు. రూ.44 కోట్ల టెండర్‌లో రూ.30 కోట్ల అవినీతి జరిగిందని చెప్పడం హాస్యాస్పదం’ అని మంత్రి సీతక్క పేర్కొన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో కేటీఆర్ అవాస్తవాలు మాట్లాడినప్పుడు తాను గట్టిగా సమాధానం ఇచ్చిన తరువాత తనపై దుష్ప్రచారం ప్రారంభమైందని ఆమె గుర్తు చేశారు.

# సైబర్ నేరాల్లో రికవరీ అంతంతే

- సొమ్ము పోయిందా తిరిగి రావడం కష్టమే
- తెలంగాణలో రోజుకో తరహాలో
- సైబర్ మోసాలు
- బాధితుల సంఖ్య అధికంగా ఉన్నా రికవరీ అయ్యే సొమ్ము కేవలం 12 శాతమే -
- వెల్లడించిన తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో



**హైదరాబాద్, ఏప్రిల్ 13 :**
తెలంగాణలో రోజుకో కొత్త తరహాలో సైబర్ మోసాలు పెరుగుతున్నాయి. బాధితుల సంఖ్య అధికంగా ఉన్నప్పటికీ పోగొట్టుకున్న సొమ్ములో కేవలం 12 శాతం మాత్రమే రికవరీ అవుతున్నట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (TGCSB) వెల్లడించింది. యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ వ్యవస్థాపకుడు రాజేంద్ర పల్నాటి సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించిన వివరాల్లో ఈ విషయం బయటపడింది.

సైబరాబాద్ పరిధిలోనే 30 శాతం కేసులు గత ఐదేళ్లుగా నమోదైన కేసులు, బాధితులు కోల్పోయిన సొమ్ము, రికవరీ చేసిన నగదు వివరాలను TGCSB వెల్లడించింది. రాష్ట్రంలో నమోదైన కేసుల్లో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోనే సుమారు 30 శాతం కేసులు నమోదవుతున్నాయి. హైదరాబాద్, రాచకొండ కమిషనరేట్లు కలిపితే ఈ సంఖ్య 70 శాతానికి చేరుతోంది.

**విదేశాల నుంచి మోసాల నిర్వహణ**
సైబర్ నేరాల ఫిర్యాదులను FIRలుగా నమోదు చేయడంలో తెలంగాణ పోలీసులు ముందంజలో ఉన్నప్పటికీ బాధితుల సొమ్మును తిరిగి ఇప్పించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చైనాకు చెందిన సైబర్ ముఠాలు మయన్మార్, కంబోడియా, లావోస్ దేశాల్లో స్థావరాలు ఏర్పాటు చేసుకుని సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలను లక్ష్యంగా చేసుకుంటున్నాయి. వాట్సప్ కాల్స్ ద్వారా బాధితులను మోసగిస్తూ నగదు కాజేస్తున్నాయి. కమీషన్ ఆశతో కొందరు తమ బ్యాంకు ఖాతాలను మోసగాళ్లకు అప్పగించడంతో మ్యూల్ ఖాతాల ద్వారా నగదు తరలింపు జరుగుతోంది.

**మ్యూల్ ఖాతాల ద్వారా నగదు తరలింపు**
ముందుగా బాధితుల నుంచి కాజేసిన నగదును మ్యూల్ ఖాతాల్లో జమ చేస్తారు. అనంతరం ఇతర ఖాతాలకు బదిలీ చేసి ఏటీఎంలు, బ్యాంకుల ద్వారా నగదును ఉపసంహరిస్తారు. చివరకు సేకరించిన మొత్తాన్ని క్రిప్టో కరెన్సీగా మార్చి విదేశాలకు తరలిస్తున్నారు. విదేశాలకు చేరిన సొమ్మును తిరిగి తెప్పించడం కష్టసాధ్యంగా మారుతోంది.

**మోసం జరిగితే వెంటనే ఫిర్యాదు**
సైబర్ మోసం జరిగినట్లు గుర్తిస్తే వెంటనే 1930 జాతీయ హెల్ప్‌లైన్ నంబరుకు కాల్ చేయాలి. ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలి. బ్యాంకు శాఖకు సమాచారం ఇచ్చి ట్రాన్సాక్షన్లను వెంటనే నిలిపివేయాలని సూచిస్తున్నారు.

**వేల కోట్లు కొల్లగొట్టిన నేరగాళ్లు**
ఇటీవలి కాలంలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. ఉన్నత విద్యావంతులు, అధికారులు, సాధారణ ప్రజలు కూడా ఈ మోసాలకు బలవుతున్నారు. హైదరాబాద్‌లో ఒక వ్యక్తి రూ.16 కోట్లు కోల్పోయిన ఘటన నమోదైంది. దేశవ్యాప్తంగా సైబర్ నేరగాళ్లు 2025లో రూ.22,495 కోట్లు, 2024లో రూ.22,845 కోట్లు కొల్లగొట్టినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి.



# మహిళా రిజర్వేషన్లపై విమర్శలు తగవు

- ప్రతి ఒక్కరూ స్వాగతించాల్సిందే
- డీలిమిటేషన్‌తో ఎవరికీ అన్యాయం జరగదు
- సిఎం రేవంత్ వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ డీకే అరుణ

**హైదరాబాద్, ఏప్రిల్ 13:**
మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్‌ను దేశ ప్రజలు స్వాగతిస్తున్నారని ఎన్డీయే కూటమి పార్టీల నేతలే చెబుతున్నారని బీజేపీ ఎంపీ డీకే అరుణ అన్నారు. మహిళా రిజర్వేషన్ అంశానికి ప్రతిపక్ష పార్టీలు మద్దతు ఇస్తూనే డీలిమిటేషన్‌పై విమర్శలు చేస్తున్నాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా విమర్శలు చేయడం సరికాదని ఆమె వ్యాఖ్యలు చేశారు. దక్షిణాది, చిన్న రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ డీకే అరుణ తీవ్రంగా స్పందించారు. మహిళా రిజర్వేషన్లు, పార్లమెంటు, అసెంబ్లీలలో మహిళల ప్రాతినిథ్యం పెంచడానికి సాయపడుతుందని డీకే అరుణ తెలిపారు. మహిళా రిజర్వేషన్ల అంశంపై రాజకీయం చేయవద్దని ప్రతిపక్ష పార్టీలకు ఆమె సూచించారు. ఈ రిజర్వేషన్ల ద్వారా చట్టసభల్లో మహిళలకు సమాన అవకాశాలు లభిస్తాయని, దీనికి పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరి మద్దతును అవసరమని ఆమె అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో, ఇలాంటి చట్టాలు మహిళలకు చాలా మేలు చేస్తాయని ఎంపీ తెలిపారు. రిజర్వేషన్లతో చట్టసభల్లో మహిళల ప్రాతినిథ్యం పెరుగుతుందని డీకే అరుణ అన్నారు. అలానే డీలిమిటేషన్‌పై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. నియోజకవర్గాల పునర్విభజనపై సీఎం రేవంత్ రెడ్డికి అవగాహన లేదన్నారు. తాము కూడా దక్షిణాదిలోనే ఉన్నామని, అన్యాయం జరగనివ్వబోమని చెప్పారు. 2011 జనాభా లెక్కల ప్రకారమే డీలిమిటేషన్ జరుగుతుందని, ఈ పక్రియకు రెండేళ్ల సమయం పడుతుందని అన్నారు. డీలిమిటేషన్, మహిళల రిజర్వేషన్లను రాజకీయం చేయొద్దని కాంగ్రెస్‌ను కోరుతున్నాని తెలిపారు. ఈ మొత్తం వ్యవహారాన్ని రేవంత్‌కే వదిలేస్తున్నాని కిషన్‌రెడ్డి అన్నారు.



# మూసీ అభివృద్ధిలో భాగస్వాములను చేయండి

- **మూడు ప్రతిపాదనలను పరిశీలించండి**
- **ఉప ముఖ్యమంత్రికి మధు పార్క్ రిడ్జ్ నిర్వాసితుల వినతిపత్రం**

**హైదరాబాద్, ఏప్రిల్ 13:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మూసీ పునర్జీవ పథకంలో భాగస్వాములను చేయాలని, నిర్వాసితులుగా తమకు న్యాయం చేయాలని మధు పార్క్ 'ఎ' బ్లాక్ నిర్వాసితులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లుకు వినతిపత్రం సమర్పించారు. అందుకు మూడు ప్రతిపాదనలను పరిశీలన కోసం సమర్పిస్తున్నామన్నారు. ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎంను మధు పార్క్ రిడ్జ్ 'ఎ' బ్లాక్ నిర్వాసితులు సోమవారం మధ్యాహ్నం కలిశారు. మూసీ పునర్జీవ పనులను స్వాగతిస్తున్నామని, అభివృద్ధి పనులపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదంటూ తమను కూడా అభివృద్ధిలో భాగస్వాములను చేయాలని కోరారు. నిర్వాసితుల ప్రతిపాదనలపై డిప్యూటీ సీఎం స్పందిస్తూ మూడు ప్రతిపాదనలను మానవీయ కోణంలో ఆలోచించి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ ప్రతిపాదనలను పరిశీలించి మూసీ కేబినెట్ సబ్ కమిటీకి నివేదిక ఇవ్వాలని మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ఈవీ నరసింహారెడ్డి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డిలను ఆదేశించారు. వినతి పత్రం సమర్పించిన వారిలో మధు పార్క్ రిడ్జ్ 'ఎ' బ్లాక్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.శ్రీశైలం, సెక్రటరీ డాక్టర్ కరీముల్లా, సలహాదారు సంజయ్ శుక్ల, లీగల్ అడ్వైజర్ ప్రతాపరెడ్డి, జేపీసీ బి.ఎన్.రెడ్డి, ఉపాధ్యక్షుడు రాంబాబు తదితరులు ఉన్నారు.



# మహిళా కోటాతో ముడిపెట్టవద్దు

**మొదటిపేజీ తరువాయి**

డీలిమిటేషన్‌ని ముందుకు తేవొద్దని సూచించారు. డీలిమిటేషన్‌పై కేంద్రం తీరు సరైనది కాదని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్, లోక్‌సభ డీలిమిటేషన్ వేర్వేరు అంశాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ప్రస్తావించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి ట్వీట్ పెట్టారు. జనాభా ఆధారిత డీలిమిటేషన్‌పై ఆందోళనలు చేయొద్దని అన్నారు. దక్షిణ, చిన్న రాష్టా□లకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. డీలిమిటేషన్ తాత్కాలిక రాజకీయ లాభమని, కానీ దేశానికి తీరని నష్టమని ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ ప్రయోజనం.. పార్టీ ప్రయోజనాల కంటే ముఖ్యమైనదని చెప్పారు. పోరాటా విధానానికి ప్రత్యామ్నాయాలు పరిశీలించాలని సూచించారు. డీలిమిటేషన్‌పై అన్ని పార్టీలతో చర్చించి కేంద్ర ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు.

# శ్రీపాదరావుకు సీఎం రేవంత్ నివాళి

**హైదరాబాద్, ఏప్రిల్ 13:**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు 27 వ వర్థంతి సందర్భంగా జూబ్లీహిల్స్ నివాసంలో ఆయన చిత్రపటం వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. తెలుగు రాష్ట్రాల్లో తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్న నాయకుడు దుద్దిళ్ల శ్రీపాదరావు అని ఈ సందర్భంగా సీఎం నివాళి అర్పించారు. సర్పంచ్ స్థాయి నుంచి శాసనసభ స్పీకర్ వరకు అన్ని పదవులకు వన్నె తెచ్చిన నేత అని ఆయన కొనియాడారు. శాసనసభ ఔనత్యాన్ని పెంపొందిస్తు హుందాగా ఆయన సభను నడిపిన తీరు శ్లాఘనీయమని ముఖ్యమంత్రి అన్నారు. దుద్దిళ్ల శ్రీపాదరావు జీవితం నేటి తరానికి ఒక గొప్ప స్ఫూర్తి అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి,ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ఎంఎల్ ఏ సంజయ్ పాల్గొన్నారు.

# తట్టేపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- **స్కూటీని ఢీకొట్టిన లారీ**
- **ప్రమాదంలో దంపతులతో సహా చిన్నారి మృతి**

**వికారాబాద్, ఏప్రిల్ 13:**

వికారాబాద్ జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. పెద్దేముల్ మండలం తట్టేపల్లి దగ్గర ఓ టూవీలర్‌ను లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో భార్యాభర్తలు సహా ఓ చిన్నారి దుర్మరణం చెందింది. మృతులు తాండూరు నుంచి జహీరాబాద్ వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. కాగా, యాక్సిడెంట్ తర్వాత పారిపోయిన లారీ డ్రైవర్.. పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు తెలుస్తోంది. పెద్దేముల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండల పరిధిలోని ట్టటెపల్లి గ్రామ శివారులో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. వికారాబాద్ జిల్లా రుక్మాపూర్ గ్రామానికి చెందిన పావని (35), ఆమె భర్త కవిరాజ్ (40) జహీరాబాద్‌లో నివసిస్తున్నారు. వీరు ఆదివారం సాయంత్రం జహీరాబాద్ నుంచి రుక్మాపూర్ గ్రామానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా లారీ వీరి స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పావని, కవిరాజ్, కీర్తన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కుమారుడు కార్తీక్ స్వల్ప గాయాలతో ప్రాణాలతో బయటపడ్డాడు. చికిత్స నిమిత్తం తాండూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ మహమ్మద్ షరీఫ్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దేముల్ పోలీసులు తెలిపారు.

# విషగుళికలు తిని చిన్నారి మృతి

**ములుగు, ఏప్రిల్ 13:**

ములుగు జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. కోతుల బెడద తప్పించు కోవడానికి పెట్టిన విషగుళికలు తిని నాలుగేళ్ల బాలుడు మరణించాడు. వివరాల్లోకి వెళ్తే.. ములుగు జిల్లా గోవిందరావుపేటలోని కోతుల బెడద ఎక్కువగా ఉంది. దీంతో కోతులను చంపేందుకు అంగన్‌వాడీ కేంద్రంలోని నర్సరీ ప్రాంతంలో గ్రామ పంచాయతీ సిబ్బంది విషగుళికలను పెట్టారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్న పిల్లలకు ఇచ్చే బాలామృతంలో వాసన లేకుండా ఉండే విషగుళికలను కలిపి పెట్టారు. ఎన్టీఆర్ నగర్‌కు చెందిన ఆరఎంపీ వైద్యుడు శ్రవణ్ కుమారుడు హర్షిత్ నందన్ (4) ఆదివారం సాయంత్రం స్నేహితులతో ఆడుకుంటూ అంగన్‌వాడీ కేంద్రం సమీపంలోకి వెళ్లాడు. ఆ సమయంలో విషగుళికలు కలిపిన బాలామ□తం చూశాడు. దాన్ని తినేశాడు. అనంతరం అస్వస్థతకు గురవ్వడంతో గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ములుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

# గాలి మోటార్లలో సీఎం, మంత్రుల టూర్లు

**మొదటిపేజీ తరువాయి**




సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. ఎందుకు కొనుగోలు చేయడం లేదని అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలు లేక పంట దళారుల పాలవుతున్నదని, శనగలపై ఎకరానికి రూ.10 వేల నష్టం వాటిల్లిందని చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన బోనస్ హామీ పూర్తిగా బోగస్ అని, నేడు కనీస మద్దతు ధరకూ దిక్కులేదని వ్యాఖ్యానించారు. ఏటిగడ్డ సంఘం తదితర గ్రామాల రైతులు శనగలు కొనడం లేదని తమ దృష్టికి తేవడంతో ఇక్కడి డీసీఎంఎస్ సెంటర్‌కు వచ్చామని, రైతులను, నిర్వాహకులను అడిగితే కోటా అయిపోయిందని చెబుతున్నారని తెలిపారు. ఇది ముమ్మాటికీ రైతు వ్యతిరేక ప్రభుత్వమన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు గల్లీకి ఎక్కువ.. ఢిల్లీకి తక్కువ అన్నట్లుగా తయారయ్యారు.. గాలి మోటార్లలో కేరళ, ఢిల్లీ పర్యటనలు చేస్తూ బిజీగా ఉన్న వారికి రైతుల కష్టాలు పట్టడం లేదని ఎద్దేవా చేశారు. సదాశివపేటలో కొత్తగా శనగలు కొనకపోగా, ఇప్పటికే కొన్న వాటికి బిల్లులు కావడం లేదన్నారు. బస్తాలు ఖాళీ చేసి రైతులకే వెనక్కి ఇచ్చేస్తున్నారని, వారం రోజులుగా పడిగాపులు కాస్తున్నామని మొగలయ్య లాంటి రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారని చెప్పారు. ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలన్నారు. మార్కెటింగ్ శాఖ మంత్రి, సివిల్ సప్లైస్ మంత్రి, ముఖ్యమంత్రి ఎక్కడికి పోయారని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంకా 60 వేల క్వింటాళ్ల శనగలు రైతుల దగ్గర ఉన్నాయి.. వెంటనే రూ.5870 మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతులు బయట అమ్ముకుని క్వింటాల్‌కు రూ.1000 చొప్పున, ఎకరానికి రూ.10 వేలు నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 11 లక్షల ఎకరాల్లో మక్కజొన్న పండితే సగం కొనుగోలు కేంద్రాలు కూడా ప్రారంభం కాలేదు.. సంచులు లేవని టోకెన్లు ఆపేశారని రైతులు చెబుతున్నారు.. మద్దతు ధర రూ.2400 ఉంటే రూ.16001700లకే అమ్ముకుని రైతులు నష్టపోతున్నారు అని వివరించారు. జొన్నల కొనుగోలుపై ప్రభుత్వం ఇంతవరకు నిర్ణయమే తీసుకోలేదన్నారు. ఆరుగాలం కష్టపడ్డ రైతులు పక్క రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటకకు వెళ్లి సగం ధరకే జొన్నలు అమ్ముకునే దుస్థితి వచ్చిందని, వడ్లు కూడా రోడ్ల మీదనే ఉన్నాయని తెలిపారు. ఎన్నికల ముందు రైతు డిక్లరేషన్‌లో ప్రతి పంటకు బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్ ఇప్పుడు ఆ మాటను బోగస్ చేసిందన్నారు. మక్కలు, కందులు, శనగలు, జొన్నలకు బోనస్ ఇవ్వడం లేదంటూ కనీసం సన్న వడ్లకైనా ఈ యాసంగిలో బోనస్ ఇస్తారా లేదా అనేది స్పష్టం చేయాలన్నారు. ముఖ్యమంత్రి టూర్లు ఆపి రైతుల కష్టాల మీద సమీక్షించాలని హితవు పలికారు. భూములు, కాంట్రాక్టులు, కమీషన్ల మీద రివ్యూలు చేస్తారు తప్ప గరీబ్ రైతుల కోసం మీకు సమయం దొరకదా అని నిలదీశారు. కొనుగోళ్లు ఆగిపోయాయన్న కనీస సమాచారం ఇంటెలిజెన్స్ మీకు చెప్పడం లేదా అన్నారు. ఇక్కడ మల్లేశం అనే రైతు చెబుతున్నాడు.. రోజుకు 10 గంటల కరెంటే ఇస్తున్నారని. పొద్దున ఎనిమిదింటికి కరెంటు వస్తోందని రైతులు వాపోతున్నారు. కరెంటు ఇవ్వరు, రైతుబంధు వేయరు, బోనస్ ఇవ్వరు, పండిన పంటను మద్దతు ధరకు కొనరు.. మీ ప్రభుత్వం రైతుల కోసమా? లేక కాంట్రాక్టర్లు, దళారుల కోసమా అని అడిగారు. ముఖ్యమంత్రి తక్షణమే స్పందించి జొన్నలు, పొద్దుతిరుగుడు, వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, కోటా పేరుతో ఆగిపోయిన శనగల కొనుగోలును వెంటనే మొదలుపెట్టాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. వెంటనే కేంద్రాలు తెరిచి సన్న వడ్లకు గత యాసంగితోపాటు, ఈ యాసంగి బోనస్ కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు. హరీశ్ రావు వెంట సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# ఒంటరి వృద్ధురాలిపై దాడి

- **రోకలిబండతో బాదిన దుండుగులు**
- **బంగారం దోచుకుని పరార్**

**కామారెడ్డి, ఏప్రిల్ 13:**



కామారెడ్డి జిల్లాలోని భిక్కనూరు మండల కేంద్రంలో జరిగిన దారుణ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఇంట్లోకి చొరబడి ఓ వృద్ధురాలిపై రోకలిబండతో దాడి చేసి, ఆమె బంగారు ఆభరణాలను అపహరించిన ఘటన ప్రజలను భయభ్రాంతులకు గురి చేసింది. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భిక్కనూరు మండల కేంద్రంలో నివసిస్తున్న ఓ వృద్ధురాలు తన ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడ్డారు. ఆ సమయంలో ఆమెపై అకస్మాత్తుగా దాడికి పాల్పడ్డారు. దాడికి రోకలి బండను ఉపయోగించినట్లు సమాచారం. ఈ దాడిలో వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. దాడి సమయంలో ఆమె అరుస్తూ సహాయం కోరినప్పటికీ, దుండగులు ఆమె బంగారు ఆభరణాలను బలవంతంగా లాక్కొని పరారయ్యారు. వాటి విలువ ఎంతన్నది పూర్తిగా నిర్ధారణ కాలేదు. ఈ ఘటనలో వృద్ధురాలి తలకు తీవ్ర గాయాలైనట్లు వైద్యులు తెలిపారు. రక్తస్రావం అధికంగా ఉండటంతో స్థానికులు వెంటనే స్పందించి ఆమెను సమీప ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై వైద్య బృందం నిరంతరం పర్యవేక్షిస్తోంది. ఈ దారుణ ఘటనతో భిక్కనూరు ప్రాంత ప్రజల్లో భయాందోళన నెలకొంది. వృద్ధురాలిపై ఇంతటి క్రూరమైన దాడి జరగడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దుండగులు ముందుగా ఇంటి పరిస్థితిని గమనించి, ఎవరు లేని సమయం చూసి లోపలికి చొరబడినట్లు పోలీసులు భావిస్తున్నారు. బంగారు ఆభరణాల సమాచారం ముందుగానే తెలిసి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఈ దాడి పథకం ప్రకారం జరిగిందా లేదా అకస్మాత్తుగా జరిగిన దోపిడీనా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను సేకరించి, అనుమానితులను గుర్తించడానికి చర్యలు చేపట్టారు. స్థానికుల నుంచి కూడా సమాచారం సేకరిస్తున్నారు. పోలీసులు ఈ ఘటనను సీరియస్‌గా తీసుకుని, దోషులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

## సమ్మెపై కార్మికులు ఆలోచించాలి: పొన్నం

**హైదరాబాద్, ఏప్రిల్ 13:**

తెలంగాణ ఆర్టీసీ కార్మికుల సమ్మెపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. రెండు అంశాలపై ప్రభుత్వం కమిటీ వేసిందని తెలిపారు. కమిటీ నుంచి పూర్తి వివరాలు వచ్చిన తర్వాత కార్మికులకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఆర్టీసీ విలీనం, యూనియన్ అంశంపై కమిటీ వేసినట్లు తెలిపారు. మిగతా అంశాలు క్లియర్ చేయడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. ఆర్టీసీ కార్మికులు ఆలోచించాలని.. తొందర పడవద్దని మంత్రి పొన్నం విజ్ఞప్తి చేశారు. సమ్మెకు సిద్ధమవుతున్న ఆర్టీసీ కార్మికులు.. లేబర్ కమిషనర్‌తో చర్చలు జరపాలని నిర్ణయించారు. లేబర్ కమిషనర్ కార్యాలయం వద్దకు భారీగా ఆర్టీసీ కార్మికులు చేరుకోవాలని జేఏసీ పిలుపునిచ్చింది. చర్చల అనంతరం సమ్మె తేదీ ప్రకటించే అవకాశం ఉంది .

## టెట్ నోటిఫికేషన్2026 విడుదల

హైదరాబాద్, ఏప్రిల్ 13 : తెలంగాణలో టెట్ (ఉపాధ్యాయ అర్హత పరీక్ష) నోటిఫికేషన్2026 విడుదలైంది. ఏప్రిల్ 15 నుంచి దరఖాస్తులు ప్రారంభం కానుండగా, 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. జూన్ 9 నుంచి టెట్ హాల్ టికెట్లు జారీ చేసి, జూన్ 15 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించనున్నారు. జులై 28 నుంచి 31 మధ్య ఫలితాలు విడుదల చేస్తామని ప్రభుత్వం తెలిపింది.

**టెట్ నోటిఫికేషన్-2026 ముఖ్య వివరాలు :**

ఏప్రిల్ 15 నుంచి దరఖాస్తులు ప్రారంభం
ఏప్రిల్ 15 నుంచి 30 వరకు టెట్ ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ
జూన్ 9 నుంచి టెట్ హాల్‌టికెట్లు జారీ
జూన్ 15 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో టెట్ పరీక్ష నిర్వహణ
జులై 28 నుంచి 31 మధ్య టెట్ ఫలితాలు విడుదల

# నాంపల్లి రెడ్‌హిల్స్ లో అగ్నిప్రమాదం

- **సకాలంలో మంటలను ఆర్పిన ఫైర్ సిబ్బంది**

**హైదరాబాద్, ఏప్రిల్ 13:**

నాంపల్లి రెడ్‌హిల్స్‌లోని మూడంతస్తుల భవనంలో సోమవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. భవనం మూడో అంతస్తులో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రమాద సమయంలో భవనంలో 23 మంది నివాసితులు ఉన్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. భవనంలో చిక్కుకున్న 23 మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని, ప్రాణనష్టం ఏమీ లేదని అధికారులు తెలిపారు. మంటలు వేగంగా వ్యాప్తి చెందే అవకాశం ఉన్నప్పటికీ, అగ్నిమాపక శాఖ సిబ్బంది త్వరితగతిన స్పందించి.. మంటలు ఇతర ఫ్లోర్లకు వ్యాపించకుండా నివారించారు. చివరకు మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. భవనంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో స్థానికులు భయాందోళనకు



గురయ్యారు. మంటలు పూర్తిగా అదుపులోకి రావడం, ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. అగ్నిప్రమాదంపై స్థానిక పోలీసులు, అగ్నిమాపక అధికారులు దర్యాప్తు మొదలుపెట్టారు.

# ఆర్టీసీలో మోగిన సమ్మె సైరన్

- **22 నుంచి సమ్మెకు వెళ్తున్నట్లు జేఏసీ ప్రకటన**
- **ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్**

**హైదరాబాద్ :**

తెలంగాణ ఆర్టీసీలో సమ్మె సైరన్ మోగింది. ఏప్రిల్ 22 నుంచి సమ్మెకు వెళ్తున్నట్లు ఆర్టీసీ జేఏసీ ప్రకటించింది. గత మార్చి 13న సమ్మె నోటీసులు ఇచ్చామని, రాష్ట్ర ప్రభుత్వం, యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందన రాలేదని జేఏసీ తెలిపింది.

ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్* సమ్మె నివారణ చర్యలు ప్రభుత్వం చేపట్టాలని ఆర్టీసీ జేఏసీ కోరింది. తెలంగాణ ప్రభుత్వం, యాజమాన్యం ముందుకు 32 డిమాండ్లు పెట్టామని తెలిపారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని జేఏసీ వైస్ ఛైర్మన్ థామస్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులతో



సమానంగా జీతభత్యాలు ఇవ్వాలని తెలిపారు. ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని కార్మిక శాఖ కార్యాలయంలో ఈ నెల 9న లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారులతో జేఏసీ నేతలు సమావేశమయ్యారు. ప్రభుత్వం, యాజమాన్యం కార్మికుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే కార్మిక శాఖకు, యాజమాన్యానికి సమ్మె నోటీసులు అందజేసినట్లు తెలిపారు.

హామీలు అమలు చేయాలని డిమాండ్* కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని జేఏసీ ఛైర్మన్ ఈదురి వెంకన్న డిమాండ్ చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. ఆర్టీసీ విస్తరణ పేరుతో సంస్థను నిర్వీర్యం చేయవద్దని తెలిపారు. ప్రైవేటు ఎలక్ట్రిక్ బస్సుల వల్ల గుత్తేదారుల చేతుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని, వాటిని ప్రభుత్వమే నిర్వహించాలని సూచించారు.

పరిష్కారం వరకు పోరాటం కొనసాగుతుంది* తమ డిమాండ్లను పరిష్కరించకపోవడం వల్లనే సమ్మె దిశగా వెళ్లాల్సి వస్తోందని వెంకన్న తెలిపారు. ఒక వేళ సమ్మె జరిగితే దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. సమస్యలకు పరిష్కారం లభించే వరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

వేతన సవరణ అమలు చేయాలని డిమాండ్* ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న ప్రధాన డిమాండ్‌తో మార్చి 13న సమ్మె నోటీసులు ఇచ్చినట్లు జేఏసీ నేతలు తెలిపారు. లేబర్ కమిషనర్ కార్యాలయానికి వెళ్లి నోటీసు అందజేసినట్లు పేర్కొన్నారు. 2021 వేతన సవరణను 30 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని, మహాలక్ష్మి పథకం కింద ప్రతి నెల ఇచ్చే రూ.350 కోట్ల నిధులను ఎలాంటి కోతలు లేకుండా విడుదల చేయాలని డిమాండ్ చేశారు

## కోనోకార్పస్ మొక్కల తొలగింపుకు ప్రజా వాణి లో వినతి పత్రం అందజేత

- ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి: తహాశీల్దార్ రాంప్రసాద్
- స్థానిక జాతి మొక్కలనే నాటాలి: గ్రీన్ వే ఎన్విరాన్మెంటల్ సొసైటీ డిమాండ్

**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** గ్రామ చెరువులు, ప్రజా ప్రదేశాలు, రహదారుల పక్కన విస్తరిస్తున్న కోనోకార్పస్ మొక్కల వల్ల పర్యావరణం, ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాలు పడుతున్నాయని పేర్కొంటూ గ్రీన్ వే ఎన్విరాన్మెంటల్ సొసైటీ అధ్యక్షుడు దుద్దెల రవికుమార్ వినతి పత్రం అందజేశారు.

**నేలకొండపల్లి మండలంలో జరిగిన** ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎంపీడీవో యం.యర్రయ్య, స్థానిక తహసిల్దార్ రాంప్రసాద్ కు వినతిని సమర్పించారు. కోనోకార్పస్ మొక్కలు అధికంగా నీటిని పీల్చుకోవడం వల్ల చెరువుల నీటి మట్టం తగ్గిపోవడం, దీని వేర్లు రోడ్లు, కాలువలు, భవనాలకు నష్టం కలిగించడం జరుగుతోందని తెలిపారు. అలాగే ఈ మొక్కల నుండి వచ్చే పుప్పొడి వల్ల పిల్లల్లో శ్వాసకోశ సమస్యలు, అలర్జీలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల గ్రామ పరిధిలో ఉన్న కోనోకార్పస్ మొక్కలను వెంటనే తొలగించి, స్థానిక జాతి మొక్కలను నాటాలని సంబంధిత అధికారులను కోరారు. ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తును అధికారులు బాధ్యతగా తీసుకుని, త్వరగా పరిష్కరించాలని. నేలకొండపల్లి తహశీల్దార్ రాంప్రసాద్ ఆదేశించారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన బాధితుల నుంచి వినతులు స్వీకరించారు.

## తల్లంపాడులో అక్రమార్కుల ఆధిపత్యం..!

- విద్యుత్ తీగల క్రింద,రహదారుల పై ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
- ప్రజావాణిలో ఫిర్యాదు,చర్యలకు అధికారుల వెనకడుగు
- జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని వేడుకోలు

**ఖమ్మం, రాజముద్ర న్యూస్:**

గ్రామాల్లో అంతర్గత రహదారులు ఆక్రమించి,నిబంధనలకు విరుద్ధంగా ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారన్న ఫిర్యాదుల పై సంబంధిత అధికారులు స్పందించడం లేదు.ప్రజావాణి కార్యక్రమంలో వరుసగా ఫిర్యాదులు అందిస్తున్నప్పటికీ పట్టించుకోకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారు.ఖమ్మం రూరల్ మండలంలోని తల్లంపాడు గ్రామంలో పంచాయితీ అంతర్గత రహదారులను ఆక్రమిస్తూ కొందరు వ్యక్తులు ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తున్నారు.గత నలభై ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం గ్రామంలోని ఎస్సీలకు ఇండ్ల ప్లాట్లను కేటాయించగా 1986లో ప్లాట్ల సరిహద్దులో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యాన్ని కల్పించారు.ఇటీవల ప్రజా ప్రభుత్వం పలువురికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయగా వారు తమకు కేటాయించిన స్థలం పరిధిని దాటి రహదారిని కబ్జాతో పాటుగా ఏకంగా విద్యుత్ తీగల క్రిందనే అక్రమంగా ఇంటిని నిర్మిస్తూ ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

**ప్రజావాణిలో ఫిర్యాదు పై చర్యలు శూన్యం..!**

వీధుల్లోని అంతర్గత రహదారులు ఆక్రమణ, విద్యుత్ తీగల క్రిందనే ఇంటి నిర్మాణం చేపడుతున్నారని రాయబారపు రమేష్ అనే వ్యక్తి ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ,పంచాయితీ రాజ్, విద్యుత్ శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు స్పందించిన దాఖలాలు లేవని తెలిపారు.ఉద్దేశ్య పూర్వకంగానే 1986 వ సంవత్సరంలో ఏర్పాటు చేసిన విద్యుత్ తీగల క్రింద ఇంటి నిర్మాణం చేపడుతూ విద్యుత్ తీగలను మార్చాలని అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు.దీనికి తోడు అధికారులు చేష్టలుడిగి చూస్తుండటంతో నిర్మాణాలు మితిమీరిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజావాణి వినతులను బుట్టదాఖలు చేస్తూ అక్రమార్కులకు కొమ్ము కాస్తూ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న వారి పై జిల్లా కలెక్టర్ తక్షణమే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## పిడిఎస్ దందా ఆగేనా..?

- గతంలో పలు ఘటనలు
- అధికారులు పర్యవేక్షించేనా..?

**బీర్కూర్, రాజముద్ర న్యూస్:**

ప్రస్తుతం పేదలకు ఇబ్బందులు కలుగకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మూడు నెలల రేషన్ బియ్యం ను పంపిణీ చేస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. గతంలో నెల నెల రేషన్ బియ్యం పంపిణీ జరుగుతుండగా లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసిన ఆయా రైస్ డిపోలు ఆ బియ్యాన్ని అక్రమంగా పలు మిల్లులకు తరలిస్తు న్నారు. ఇదే బియ్యాన్ని ఆ మిల్లుల యజమానులు రిసైక్లింగ్ చేసి మళ్లీ ప్రభుత్వానికి అప్పగిస్తున్నట్లు తెలుస్తుంది. కామారెడ్డి జిల్లా బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలంలోని ఆయా రైస్ మిల్లుల పిడిఎస్ దందాపై ప్రత్యే కథనం.

**గతంలో పలు కేసులు...**

బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలంలో గతంలో పలు రైస్ మిల్లులకు భారీగా పిడిఎస్ బియ్యం తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నా ఘటనలు ఉన్నాయి. దీనికి తోడు బీర్కూర్ ఉమ్మడి మండలంలో రెండు, మూడు నెలల క్రితమే కొన్ని పిడిఎస్ బియ్యం మిల్లులకు తరలిస్తుండగా అధికారులు పట్టుకున్నారు. వారిపై చర్యలు సైతం తీసుకున్నారు. ఓ మిల్లు ను పది రోజుల వరకు మూసి ఉంచిన ఘటన సైతం ఉంది.

**అర్ధరాత్రి వస్తున్న పిడిఎస్..?**

గతంలో ఆయా ప్రాంతాల నుంచి బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలంలోని పలు మిల్లులకు పిడిఎస్ భారీగా వస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయం పలు పత్రికల్లో గతంలో కథనాలు ప్రచురితం కావడంతో అధికారులు పర్యవేక్షణ పెట్టగా నస్రుల్లాబాద్, బీర్కూర్ మండలాల్లో భారీగా పిడిఎస్ బియ్యంను పోలీసులు, అధికారులు పట్టుకున్నారు. ప్రస్తుతం మూడు నెలల రేషన్ బియ్యం లబ్దిదారులకు అందగా గ్రామాల్లో తిరుగుతూ కొందరు బియ్యం సేకరించగా, మరికొందరు రైస్ డిపోలు ఈ రేషన్ బియ్యం కొనుగోలు చేసి పలు మిల్లులకు తరలిస్తున్నట్లు తెలుస్తుంది.

**అధికారులు పర్యవేక్షణ పెట్టేనా...?**

బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలలో పిడిఎస్ దందాపై భారీగా ఆరోపణలు వెల్లువెతు తు న్నాయి. ఈ విషయంపై అధికారులు పర్యవేక్షణ పెడితే ఈ పిడిఎస్ దందాను అరికట్టవచ్చు. మరీ అధికారులు పిడిఎస్ దందాపై పర్యవేక్షణ పెడతారా..? లేదా..? అనేది వేచి చూడాల్సిందే.

## ఆపదలో అండగా ద్రోణవల్లి సతీష్.. ప్రమాద బాధితుడికి ఆర్థిక సహాయం

**బీర్కూర్, రాజముద్ర న్యూస్:**

బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన యువకుడు ఆసిఫ్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన గురించి తెలుసుకున్న మాజీ జెడ్పిటిసి సభ్యులు ద్రోణవల్లి సతీష్ మానవత్వాన్ని చాటుకుంటూ బాధిత కుటుంబానికి అండగా నిలిచారు.. వైద్య ఖర్చులు భారంగా మారుతున్న వేళ, కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ పరిస్థితిని గమనించిన సతీష్ వెంటనే స్పందించి, బాధితుడి కుటుంబాన్ని పరామర్శించి పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రమాదాల్లో గాయపడిన వారికి సమాజం మొత్తం అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. అవసరమైన చికిత్స అందేలా ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయం చేయాలని పిలుపునిచ్చారు. స్థానికులు మాజీ జెడ్పిటిసి ద్రోణవల్లి సతీష్ చూపిన సేవాభావాన్ని అభినందిస్తూ, ఇలాంటి సహాయ చర్యలు ఇతరులకు కూడా ప్రేరణగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఆసిఫ్ త్వరగా కోలుకోవాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అరిగే ధర్మ తేజ, నాయకులు కుర్రి కృష్ణ, ఖాజా ఖాన్, చామకూర రాజు, సురేష్, మోసిన్, కాలిక్ కాజా, మొయిన్, తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ యుద్ధ మేఘాలు

- ఇరాన్‌పై దాడికి ట్రంప్, ఇజ్రాయెల్ సమాలోచనలు
- ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న ఆందోళన

**వాషింగ్టన్, ఏప్రిల్ 13:**



అమెరికాఇరాన్ మధ్య శాంతి చర్చలు విఫలమవడంతో పశ్చిమాసియా మళ్లీ నివురుగప్పిన నిప్పులా మారింది. ఏ క్షణాన ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. మరోవైపు ఇరాన్‌పై మళ్లీ దాడులు ప్రారంభించేందుకు అమెరికా, ఇజ్రాయెల్ సిద్ధమవుతున్నట్లు వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. హర్మూజ్ జలసంధిని దిగ్బంధిస్తామని అమెరికా సెంట్రల్ కమాండ్ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతోపాటు ఇరాన్‌పై పరిమిత స్థాయిలో సైనిక దాడులను పునరుద్ధరించేలా ట్రంప్ సలహాదారులు ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే ఈ దాడులకు ట్రంప్ అంగీకరిస్తారా లేదా అనేదానిపై ఇంకా స్పష్టత లేదు. ఇరాన్ (ఎసజీని)ను నలువైపులా నిర్బంధించి, హర్మూజ్ జలసంధిపై నియంత్రణ తెచ్చుకోవాలని ట్రంప్ భావిస్తున్నట్లు సమాచారం. మిత్ర దేశాలతో కలిసి ఈ మార్గంలో ప్రయాణించే నౌకలకు భద్రత కల్పించే అంశంపై ట్రంప్ చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. అటు, ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ కూడా ఇరాన్‌పై దాడులకT సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఐడీఎఫ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఇయాల్ జర్ తన సైన్యాన్ని ఆదేశించినట్లు ఇజ్రాయెల్ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇరాన్‌పై దాడుల పునరుద్ధరణ విషయంలో ట్రంప్ నిర్ణయం కోసం ఇజ్రాయెల్ ఎదురుచూస్తున్నట్లు ఆ కథనాలు తెలిపాయి. అయితే, ఈలోగా టెహ్రాన్ తమపై దాడి చేస్తే మాత్రం ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని ఐడీఎఫ్ హెచ్చరిస్తోంది. ఇదిలా ఉండగా, యూఎస్ఇరాన్ చర్చలు విఫలం కావడంతో పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు చెలరేగాయి. ఇరాన్ పోర్టుల నుంచి నౌకలు హర్మూజ్ మీదుగా రాకపోకలు సాగించకుండా నేటి సాయంత్రం 7.30 (భారత కాలమానం ప్రకారం) నిర్బంధం విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. అణు కార్యక్రమాన్ని వదులుకునేలా ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ఇజ్రాయెల్ దాడులను ప్లాన్ చేస్తున్నట్టు మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇరాన్‌ను అన్ని వైపుల నుంచి దిగ్బంధించి చర్చల్లో ప్రతిష్టంభనను తొలగించాలనేది యూఎస్ ప్రభుత్వ ఉద్దేశమని కథనాలు వెలువడ్డాయి. ఈ దిశగా నాటో దేశాలను కూడా రంగంలోకి దింపేందుకు అమెరికా ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే హర్మూజ్ మీదుగా నౌకల రాకపోకలను ఇరాన్ నిలిపివేసిన విషయం తెలిసిందే. హర్మూజ్ జలాల్లోకి యూఎస్ యుద్ధ నౌకలు వస్తే దాడులు తప్పవని హెచ్చరించింది. చర్చలు విఫలం కావడానికి అమెరికానే కారణమని తేల్చి చెప్పింది. యూఎస్ పెట్టిన అసమంజసమైన డిమాండ్ల కారణంగానే చర్చల్లో పీటముడి పడిందని పేర్కొంది. అణు కార్యక్రమం వదులుకునే దిశగా ఇరాన్ నుంచి స్పష్టమైన హామీలు రాలేదని యూఎస్ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పేర్కొన్నారు.

**హర్మూజ్‌ను దిగ్బంధిస్తే తీవ్ర పరిణామాలు : ఇరాన్ ఘాటు హెచ్చరిక**

హర్మూజ్‌ను దిగ్బంధిస్తామన్న ట్రంప్ హెచ్చరికలపై ఇరాన్ మరోసారి ఘాటుగా స్పందించింది. అది ఇప్పటికీ తమ నియంత్రణలోనే ఉందంటూ శత్రువులు ఏ చిన్న పొరపాటు చేసినా ప్రమాదం తప్పదని హెచ్చరించింది. అంతకుముందు ఇరాన్ సైనిక దళం (ఐఆర్‌జీసీ) కూడా ట్రంప్‌నకు గట్టి వార్నింగ్ ఇచ్చిన విషయం తెలిసిందే. హర్మూజ్ వైపు వచ్చే యుద్ధ నౌకలపై దాడి చేస్తామని హెచ్చరించింది. పౌర నౌకల రాకపోకలకు మాత్రం ఎలాంటి ఇబ్బందీ ఉండదని భరోసా ఇచ్చింది. యుద్ధ నౌకలు వస్తే మాత్రం కాల్పుల విరమణను ఉల్లంఘించినట్టేనని స్పష్టం చేసింది. ఇక యూఎస్‌తో చర్చలు విఫలం కావడంపై ఇరాన్ మంత్రి అరాగ్చీ ఎక్స్ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. 47 ఏళ్ల తరువాత జరిగిన అత్యున్నత స్థాయి చర్చలకు తాము సదుద్దేశంతో వెళ్లామని చెప్పారు. ఒప్పందం అంగుళం దూరంలో ఉండగా యూఎస్ తన లక్ష్యాలను, ఉద్దేశాలను మార్చుకుందని ఆరోపించారు. మునుపటి అనుభవాల నుంచి ఎలాంటి గుణపాఠాలను అమెరికా నేర్చుకోలేదన్నారు. మంచి భావాలుంటే చివరకు మంచే జరుగుతుంది.. మనసులో శత్రుత్వం ఉంటే తుదకు అదే మిగులుతుంది అని 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు. కాగా, ట్రంప్ ప్రకటన తరువాత హర్మూజ్‌లో సోమవారం నౌకల ట్రాఫిక్ స్తంభించిపోయిందని లాయిడ్స్ లిస్ట్ ఇంటెలిజెన్స్ అనే మారిటైమ్ సంస్థ తాజాగా పేర్కొంది. ఎలాంటి ఒప్పందం లేకుండా ఇరాన్‌తో చర్చలు ముగియడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పందించారు. గతంలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం మాత్రం కొనసాగుతోందన్నారు. ఇరాన్ మళ్లీ చర్చలకు వస్తుందా రాదా అనేది తనకు ఇక అనవసరమని కూడా చెప్పారు. ఇప్పటికే ఇరాన్ పరిస్థితి దిగజారిందని, మిలిటరీ ధ్వంసమైపోయిందని చెప్పారు.




## ఆ ఐదు గ్రామాలను తెలంగాణలో విలీనం చేయాలి

- రామయ్య భూములు కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిదీ
- రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి

**భద్రాచలం, ఏప్రిల్ 13 :**

భద్రాచలం పరిసర ప్రాంతాల్లోని ఐదు గ్రామ పంచాయతీలు ఆంధ్రా నుంచి తిరిగి తెలంగాణలో విలీనం చేయాలని రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి డిమాండ్ చేశారు. సోమవారం భద్రాచలంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద ఉమ్మడి ఖమ్మం జిల్లా ఉద్యోగ జేఏసీ సభకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు ప్రజల ఆకాంక్షలు, భౌగోళిక పరిస్థితులు, పరిపాలనా సౌలభ్యాలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. రాజ్యసభలో ఇటీవల జరిగిన చర్చలో పాల్గొన్న ఆమె, భద్రాచలం చుట్టుపక్కల ఉన్న ఐదు గ్రామాలు భౌగోళికంగా తెలంగాణతోనే అనుసంధానమై ఉన్నాయని పేర్కొన్నారు. ఆ గ్రామాల ప్రజలు విద్య, వైద్యం, రవాణా, ఆదాయ, రెవెన్యూ, ఇతర ప్రభుత్వ సేవల కోసం భద్రాచలంపైనే ఆధారపడుతున్నారని చెప్పారు. భద్రాచల రామయ్య భూములు కూడా ఆంధ్రాలో విలీనమైన పురుషోత్తపట్నంలో వేలాది ఎకరాలు ఉన్నాయని గుర్తు చేశారు. ఈ పరిస్థితుల్లో అవి ఆంధ్రప్రదేశ్ పరిపాలనలో కొనసాగడం ప్రజలకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజన సమయంలో పోలవరం ప్రాజెక్టు అవసరాల దృష్ట్యా కొన్ని ప్రాంతాలను ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేసినప్పటికీ, ప్రస్తుతం భద్రాచలం సమీపంలోని ఐదు పంచాయతీల విషయంలో పునర్విమర్శ అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రజల సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక జీవన విధానం మొత్తం భద్రాచలంతో ముడిపడి ఉందని, ఈ అంశాన్ని కేంద్రం సానుకూలంగా పరిశీలించాలని కోరారు.

**ప్రజాప్రతినిధులు, ఉద్యోగ సంఘాల మద్దతు**

ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ ఉద్యోగ సంఘాలు, ప్రజాసంఘాలు కూడా ఐదు పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలపాలని మద్దతు తెలుపుతున్నాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు లేఖ రాసి ఈ డిమాండ్‌ను మరోసారి ముందుకు తీసుకెళ్లింది. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా ఇదే అంశంపై కేంద్రానికి విజ్ఞప్తి చేసిన విషయం ప్రాధాన్యం సంతరించుకుంది. భద్రాచలం ఐదు పంచాయతీల విలీన అంశం మరోసారి రాజకీయంగా వేడెక్కగా, స్థానిక ప్రజల్లో కూడా దీనిపై ఆసక్తి నెలకొంది. ప్రజల న్యాయమైన డిమాండ్ నెరవేరే వరకు పోరాటం కొనసాగుతుందని ఎంపీ రేణుకా చౌదరి స్పష్టం చేశారు. అనంతరం భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ ఆంధ్రాలో విలీనమైన ఐదు పంచాయతీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత భద్రాచలం గిరిజన గిరిజనేతరులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. తెలంగాణ భద్రాచలం నియోజకవర్గం లో ప్రయాణించాలంటే 10 కిలోమీటర్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రయాణించాల్సి వస్తుంది. ఈ ఐదు గ్రామపంచాయతీలను తిరిగి భద్రాచలంలో కలిపితే ప్రజలకు మాత్రమే కాకుండా దేవుడు కష్టాలు కూడా తీరుతాయన్నారు. .రాముడు ఇక్కడున్నాడు రాముడు భూములు పురుషోత్తపట్నం లో ఉన్నాయి.భద్రాచలంలో మనిషి చనిపోతే కనీసం అంత్యక్రియలు చేయడానికి కూడా స్థలము లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సభలో. రాష్ట్ర తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ ఎలూరు శ్రీనివాసరావు, యుటిఎఫ్ చాడా రవి కుమార్, బూర రాజు, ఖమ్మం జిల్లా జేఏసీ చైర్మన్ గుందుపల్లి శ్రీనివాస్, కన్వీనర్ కొనిదెల శ్రీనివాస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జేఏసీ చైర్మన్ అమర్నేని రామారావు చైతన్య భార్గవ్, వీరబాబు, టి ఎన్జీవోస్ డివిజన్ అధ్యక్షులు డెక్క నరసింహారావు సెక్రటరీ గగ్గూరి బాలకృష్ణ శ్రీనివాస్ గాంధీ అపర్ణ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ ప్రెసిడెంట్ చల్లగుల్ల నాగేశ్వరరావు భూషణ్ రావు పాల్గొన్నారు.

## విదేశాల్లో ఖాతాదారుడు

- రూ.6.5 కోట్లు కొట్టేసిన బ్యాంక్ మేనేజర్
- ఎట్టకేలకు అరెస్ట్

**హైదరాబాద్, ఏప్రిల్ 13:**

నమ్మకానికి నిలువుటద్దంగా ఉండాల్సిన బ్యాంకింగ్ వ్యవస్థలో భారీ లొసుగులు బయటపడ్డాయి. హైదరాబాద్ బేగంపేటలోని యాక్సిస్ బ్యాంక్ ఉన్నతాధికారులే ముఠాగా ఏర్పడి, ఓ ఎన్నారై ఖాతాదారుడి సొమ్ము కాజేశారు. బాధితుడు విదేశాల్లో ఉండటాన్ని ఆసరాగా చేసుకుని, ఫోర్జరీ సంతకాలతో దాదాపు రూ.ఆరున్నర కోట్లు స్వాహా చేశారు. ఈ వ్యవహారంపై యాక్సిస్ బ్యాంక్ మేనేజర్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

**యాక్సిస్ బ్యాంక్ మేనేజర్ అరెస్ట్ :**

ఆస్ట్రేలియాలో నివసిస్తున్న పరితోశ్ ఉపాధ్యాయకు హైదరాబాద్ బేగంపేటలోని యాక్సిస్ బ్యాంక్‌లో 2017 నుంచి ప్రీమియం బ్యాంకు ఖాతా ఉంది. తన ప్రమేయం లేకుండా రూ.ఆరున్నర కోట్లు కాజేసినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు 2024లో కేసు నమోదు చేశారు. అయితే అప్పటి నుంచి బ్యాంకు అధికారులు తమ పలుకుబడితో అరెస్ట్ కాకుండా ప్రయత్నించారు. తాజాగా యాక్సిస్ బ్యాంక్ మేనేజర్ వెంకటరమణను అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు. కస్టమర్ నేరుగా బ్రాంచ్‌కు వస్తే తప్ప ఇవ్వకూడని 42 లూజ్ లీఫ్ చెక్కులను అధికారులు తమకు తామే ఇచ్చుకున్నారు. ఆస్ట్రేలియాలో ఉన్న సమయంలో తన సంతకాలను ఫోర్జరీ చేసి, చెక్కుల ద్వారా నగదు విత్‌డ్రా చేశారని ఖాతాదారు పరితోశ్ ఫిర్యాదు చేశారు. ఇతర ఖాతాలతో పాటు తన తల్లిదండ్రుల అకౌంట్లలోకి తనకు తెలియకుండానే నగదును మళ్లించి అక్రమంగా విత్‌డ్రా చేసుకున్నారని పేర్కొన్నారు.

యాక్సిస్ లేకుండానే రూ.6.5 కోట్లు లూటీ : తన ఖాతాలో బ్యాలెన్స్ అసాధారణంగా తగ్గిపోవడాన్ని గమనించిన పరితోశ్, రెండేళ్లుగా న్యాయం కోసం పోరాడుతున్నారు. బ్యాంకు ఉన్నతాధికారుల నుంచి సీఈవో అమితాబ్ చౌదరి వరకు ఈమెయిళ్లు పంపినా స్పందించలేదు. విచారణ పేరుతో కాలయాపన చేసిన బ్యాంకు సిబ్బంది, బాధితుడి అనుమతి లేకుండానే ఆయన ఖాతాను క్లోజ్ చేసి చేతులు దులుపుకునే ప్రయత్నం చేశారు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు భారతీయ న్యాయ సంహిత ప్రకారం నిందితులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. యాక్సిస్ బ్యాంక్ మేనేజర్ వెంకటరమణ జైలులో ఉన్నారు. ఆయనను కస్టడీకి తీసుకుంటే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని పోలీసులు భావిస్తున్నారు. బ్యాంక్ అంతర్గత సెక్యూరిటీని ఛేదించి, ఇంతటి భారీ దోపిడీ ఎలా సాధ్యమైంది? ఈ వ్యవస్థీకృత నేరంలో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉంది? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

**మోసం జరిగితే ఇలా చేయండి :**

మన కార్డుకు సంబంధించి ఒకవేళ ఏదైనా మోసానికి గురైతే వెంటనే కార్డును బ్లాక్ చేయించాలి.

1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలి. లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సీఆర్‌పీ) వెబ్‌సైట్‌లో ఫిర్యాదును నమోదు చేయాలి.

ఆర్‌బీఐలోని కంప్లైంట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌కు నివేదించాలి.

మో సపూరిత లావాదేవీకి సంబంధించిన కాల్ రికార్డింగ్స్, ఈమెయిల్ లాంటివి కీలకాధారాలవుతాయి. పోలీసులకిచ్చే ఫిర్యాదులో వీటిని జత చేయా లి. ఇలా చేస్తే ఆన్‌లైన్ మోసాల గురించి తెలుసుకొని నిఘా ఉంచేందుకు, నియంత్రించేందుకు దోహదపడుతుంది.

## ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి ఎన్‌కౌంటర్

- మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు రూపీ మృతి
- సిద్దిపేట జిల్లా వాసిగా గుర్తింపు

**భద్రాచలం, ఏప్రిల్ 13 :**

సరిహద్దున ఉన్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మరోసారి తుపాకుల మోత మోగింది. బస్తర్ అటవీ ప్రాంతంలో సోమవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మోస్ట్ వాంటెడ్ మహిళా మావోయిస్టు రూపీ అలియాస్ భాగ్య మృతిచెందారు. బస్తర్ అటవీ ప్రాంతంలో నక్సల్స్ సమావేశమయ్యారనే పక్కా సమాచారంతో భద్రతాబలగాలు కూమింగ్ నిర్వహించాయి. కాంకేర్ జిల్లాలోని చోటే భేటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని మచ్చుపల్లి, హిందూ అటవీ ప్రాంతంలోకి ప్రవేశించిన బలగాలకు మావోయిస్టులు ఎదురుపడటంతో ఇరు వర్గాల మధ్య కాల్పులు జరిగాయి. ఈ సంఘటనలో ఏరియా కమిటీ సభ్యురాలు రూపి అలియాస్ భాగ్య మృతిచెందారు. ఘటనా స్థలం వద్ద ఒక పిస్టల్, మందుగుండు సామగ్రి, ఇతర వస్తువులను భద్రతాబలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఎన్‌కౌంటర్ సమయంలో సుమారు పదిమంది మావోయిస్టులు అడవుల్లోకి పారిపోయినట్లు సమాచారం. వారిని పట్టుకోవడానికి డ్రోన్ సర్వైలెన్స్, ప్రత్యేక కూంబింగ్ బలగాలను ఉపయోగిస్తున్నట్లు సమాచారం. రూపీపై రూ.25 లక్షల రివార్డు ఉన్నట్లు తెలుస్తోంది. రూపి 2025లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు అగ్రనేత విజయ్ రెడ్డి భార్యగా గుర్తించారు. ఈ ఎన్‌కౌంటర్‌ను కాంకేర్ జిల్లా ఎస్పీ నిఖిల్ రాకేష్ ధ్రువీకరించారు. రూపీ స్వస్థలం సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలంలోని ధర్మారం గ్రామంగా గుర్తించారు. 2004లో మావోయిస్టు పార్టీలో చేరి ఉద్యమబాట పట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంచి గుర్తింపు సాధించారు. కాగా, గత నెలలో కూడా ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు హతమైన సంగతి తెలిసిందే. ఎన్‌కౌంటర్ నేపథ్యంలో సమీప గ్రామాల్లో భద్రతను పోలీసులు కట్టుదిట్టం చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అటవీ ప్రాంతానికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరికలు జారీ చేశారు

## కొండ్రు రామచంద్రుకి డా.బీఆర్.అంబేద్కర్ జాతీయ అవార్డు

**హర్షం వ్యక్తం చేస్తున్న రఘునాథపాలెం గ్రామస్తులు**






**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** చిరుద్యోగిగా జీవనం కొనసాగిస్తూనే నలుగురికి చేసిన సేవా కార్యక్రమాలు ఆ యువకుడిని డా.బీఆర్. అంబేద్కర్ జాతీయ అవార్డుకి ఎంపికయ్యేలా చేసింది.తిరుమలాయపాలెం మండలంలోని రఘునాథపాలెం గ్రామానికి చెందిన కొండ్రు రామచంద్రు గత కొన్ని సంవత్సరాలుగా నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులను ఉన్నత చదువులు చదివేలా ప్రోత్సహిస్తూనే,ఉన్నంతలోనే ఆర్థిక సాయం అందిస్తూ తోడ్పాటునిస్తున్నారు.అదే విధంగా పలువురికి ఉపాధి అవకాశాలను చూపిస్తూ జీవితంలో నిలదొక్కుకునేలా కృషి చేశారు.ఈ సేవా కార్యక్రమాలను గురించి తెలుసుకున్న బహుజన సాహిత్య అకాడమీ సంస్థ రామచంద్రును డా. బీఆర్.అంబేద్కర్ జాతీయ అవార్డుకు ఎంపిక చేసింది.ఈ అవార్డును ఈ నెల 19 న హైదరాబాద్ లోని భాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డా. రాధాకృష్ణ చేతుల మీదుగా ప్రదానోత్సవం చేయనున్నారు.ఈ సందర్భంగా కొండ్రు రామచంద్రు మాట్లాడుతూ ఈ అవార్డు తన పై మరెంతో బాధ్యతను పెంచిందని,డా.బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో భవిష్యత్ లోనూ సేవా కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగుతాయని తెలిపారు.ఈ అవార్డు పొందేందుకు సహకరించి,ప్రోత్సహించిన వెంకటేశం బాధేకు కృతజ్ఞతలు తెలియజేశారు.అవార్డు ఎంపిక పట్ల గ్రామస్తులు,మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ రామచంద్రుకు అభినందనలు తెలిపారు.

## అంబేద్కర్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి: బిజెపి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** అంటరానితనం పై అలుపెరగని పోరాటం చేసిన మహోన్నత మూర్తి,న్యాయ కోవిదుడు,భారత రాజ్యాంగ నిర్మాత డా. బిఆర్ అంబేద్కర్ అని బిజెపి నేలకొండపల్లి మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ అన్నారు.బిజెపి జాతీయ కమిటీ పిలుపు మేరకు సోమవారం పైనంపల్లి గ్రామంలోని అంబేద్కర్ విగ్రహాన్ని శుభ్రం చేసి,ప్రత్యేకంగా అలంకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 14 న మండలంలోని అన్ని గ్రామాల్లో అంబేద్కర్ జయంతి ఉత్సవాలను నిర్వహించడం జరుగుతుందని చెప్పారు.పార్టీ శ్రేణులు,సానుభూతిపరులు పెద్ద ఎత్తున హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సుధాకర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బాజా రామకృష్ణ,ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు పిట్టల సూరిబాబు,యూవ మోర్చా మండల అధ్యక్షులు తంగేళ్ల సతీష్,సీనియర్ నాయకులు సూరేపల్లి జ్ఞానరత్నం,కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు పుట్టా సత్యనారాయణ,కందరబోయిన గోపి,కారంగుల వీరయ్య,మూడు రమేష్,పార్టీ కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## అజయ్ తండాలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు




**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి మండలంలోని అజయ్ తండా గ్రామపంచాయతీ పరిధిలో గల ప్రభుత్వ పాఠశాల ఆవరణలో రోడ్డు భద్రతా వారోత్సవాల సమావేశం ఘనంగా జరిగింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి పథంలో భాగంగా, 99 రోజుల కార్యాచరణను పురస్కరించుకుని ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ తేజావత్ శివాజీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రహదారి నిబంధనల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏఎస్ఐ లతీఫ్ మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని, ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారానే ప్రాణ నష్టాన్ని నివారించవచ్చని సూచించారు. రహదారి భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు దీనిని ఒక సామాజిక బాధ్యతగా భావించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సురేష్, ఉప సర్పంచ్ పూల్ సింగ్, కానిస్టేబుల్ రాజేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామారావు, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. అలాగే అంగన్వాడీ టీచర్ చంద్రావతి, డ్వాక్రా సంఘం ప్రతినిధి కవిత, డీలర్ తులసిరామ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తేజావత్ నరేష్, వార్డు మెంబర్లు సుశీల, బానోతు లక్ష్మణరావు, రుక్మిణి, రమణి మరియు పెద్ద సంఖ్యలో యువకులు, మహిళలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా గ్రామస్థులందరూ రోడ్డు నియమాలను పాటిస్తామని ఈ సందర్భంగా తీర్మానించారు.

# పీర్జాదిగూడ శంకర్ నగర్‌లో జెప్టో సిబ్బంది బరితెగింపు..

## కాలనీవాసులపై భౌతిక దాడులు

- అక్రమ భవనంలో యథేచ్ఛగా కార్యకలాపాలు
- తక్షణమే తొలగించాలని స్థానికుల భారీ ఆందోళన








**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:** ప్రజలకు ఇబ్బంది కలిగించే ఏ కార్యకలాపాలైన సహించేది లేదని మాజీ మేయర్ అమర్ సింగ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి తెలిపారు. ఈ మేరకు సోమవారం పీర్జాదిగూడ డివిజన్ పరిధిలోని శంకర్ నగర్ లో నిర్వహిస్తున్న జెప్టో తక్షణమే చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ రాధిక గుప్తాను కోరారు. అదేవిధంగా స్థానిక ప్రజల అభ్యర్థన మేరకు హుటాహుటిన జెప్టో నిర్వహిస్తున్న అక్రమ బహుళ అంతస్తుల భవనానికి చేరుకొని ప్రజలకు అండగా నిలిచారు. వివరాల్లోకి వెళితేపీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శంకర్ నగర్ ప్రధాన రహదారి ప్రస్తుతం అశాంతికి నిలయంగా మారింది. నివాస ప్రాంతాల మధ్య వెలసిన జెప్టో డెలివరీ సెంటర్ నిర్వాహకులు, సిబ్బంది తీరుపై స్థానిక కాలనీవాసులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత కొంతకాలంగా ఇక్కడ కొనసాగుతున్న ఈ సంస్థ కార్యకలాపాల వల్ల కాలనీలో ప్రశాంతత పూర్తిగా కరువైందని, నిత్యం వందలాది బైక్‌ల రాకపోకలతో విపరీతమైన శబ్ద కాలుష్యం, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వందలాది కుటుంబాలు, అపార్ట్మెంట్లు ఉన్న ఈ ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య కార్యకలాపాలు సాగిస్తుండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**రౌడీల్లా ప్రవర్తిస్తున్న సిబ్బంది**

**- భయాందోళనలో మహిళలు, వృద్ధులు**

ముఖ్యంగా జెప్టో సంస్థలో పనిచేస్తున్న డెలివరీ బాయ్స్ ప్రవర్తన కాలనీలో ఉద్రిక్తతకు దారితీస్తోంది. స్థానికులతో కనీస మర్యాద లేకుండా అనుచితంగా ప్రవర్తించడమే కాకుండా, వాహనాల పార్కింగ్ గురించి ప్రశ్నించిన వారిపై రౌడీల్లా దాడులకు తెగబడుతున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఇటీవల కొందరు స్థానికులపై భౌతిక దాడులు కూడా జరిగాయని, దీనివల్ల మహిళలు, చిన్నపిల్లలు, వృద్ధులు బయటకు రావాలంటేనే భయపడాల్సిన దుస్థితి ఏర్పడిందని వారు వాపోతున్నారు. డెలివరీ వాహనాలను రహదారికి ఇరువైపులా అడ్డదిడ్డంగా నిలపడం వల్ల అత్యవసర సమయాల్లో అంబులెన్సులు, ఫైర్ ఇంజన్లు కూడా వెళ్లలేని విధంగా రహదారి దిగ్బంధం అవుతోందని స్థానికులు మండిపడుతున్నారు.

**అక్రమ భవనంలో అనుమతులు లేని వ్యాపారం**

మరోవైపు, ఈ జెప్టో కార్యాలయం కొనసాగుతున్న భవనంపై కూడా అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎటువంటి మున్సిపల్ అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అక్రమ భవనంలో ఈ సంస్థ కార్యకలాపాలు సాగిస్తోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నివాస అవసరాల కోసం నిర్మించిన భవనాన్ని భారీ వాణిజ్య కేంద్రంగా మార్చడంపై అధికారుల పాత్రపై కూడా స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు ఈ అక్రమాలను చూసీచూడనట్లు వ్యవహరించడం వల్లే నిర్వాహకులు ఇంతగా బరితెగిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మాకు శాంతిభద్రతలు ముఖ్యమని, నివాస ప్రాంతాల మధ్య ఇలాంటి ఇబ్బందికర సంస్థలు ఉండకూడదని ఒకే స్వరంతో డిమాండ్ చేస్తున్నారు.

**రంగంలోకి మాజీ ప్రజాప్రతినిధులు**

**- అధికారులకు ఫిర్యాదు**

సమస్య తీవ్రతను గమనించిన స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు కాలనీవాసులకు మద్దతుగా నిలిచారు. అక్రమంగా కొనసాగుతున్న ఈ కేంద్రంపై కఠిన చర్యలు తీసుకోవాలని, తక్షణమే దీనిని నివాస ప్రాంతం నుండి తరలించాలని కోరుతూ ఉప్పల్ జోనల్ కమిషనర్‌కు రాతపూర్వక ఫిర్యాదు చేశారు. అనుమతులు లేని అక్రమ నిర్మాణాలను గుర్తించి వాటిపై చర్యలు తీసుకోవాలని, ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు ముప్పుగా పరిణమించిన జెప్టో కేంద్రాన్ని వెంటనే సీజ్ చేయాలని వారు స్పష్టం చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే కాలనీవాసులతో కలిసి మున్సిపల్ కార్యాలయం ఎదుట భారీ ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. అధికారులు స్పందించి తక్షణ పరిష్కారం చూపకపోతే ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పప్పుల అంజిరెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు, శంకర్ నగర్ కాలనీ నివాసితులు తదితరులు పాల్గొన్నారు.

## ఉదయ హైట్స్ అక్రమ కట్టడాలపై హైకోర్టు సీరియస్

**మున్సిపల్ అధికారులకు కీలక ఆదేశాలు**





**ఉప్పల్, రాజముద్ర న్యూస్:** మల్కాజిగిరి పరిధిలోని ఉదయ హైట్స్ నిర్మాణంలో జరుగుతున్న అక్రమాలపై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. రోడ్డును ఆక్రమించడమే కాకుండా, కనీస సెట్ బ్యాక్ నిబంధనలు పాటించకుండా చేపట్టిన ఈ నిర్మాణంపై గతంలో పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు అందినప్పటికీ, ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో స్థానికులు కోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు దాఖలైన రిట్ పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం.. మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్, జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్‌తో పాటు వాటర్ బోర్డ్ చైర్మన్‌కు తగిన ఆదేశాలు జారీ చేసింది.

రోడ్డు ఆక్రమణలు, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన కట్టడాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని హైకోర్టు స్పష్టం చేసింది. అధికారుల నిర్లక్ష్యంపై అసహనం వ్యక్తం చేస్తూ, చట్ట ప్రకారం అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఆదేశించింది. ఇప్పటికైనా మున్సిపల్ యంత్రాంగం స్పందించి, ఉదయ హైట్స్ వద్ద రోడ్డును ఆక్రమించి కట్టిన గోడలను, సెట్ బ్యాక్ లేకుండా నిర్మించిన ఇతర కట్టడాలను వెంటనే కూల్చివేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజా సౌకర్యార్థం ఉన్న రోడ్లను ప్రైవేటు వ్యక్తులు ఆక్రమిస్తుంటే చూస్తూ ఊరుకోబోమని, న్యాయపోరాటం ద్వారా నిబంధనలు అమలు చేసేలా చూస్తామని ఈ సందర్భంగా ప్రతినిధులు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో చింతల శ్రీనివాస్ రెడ్డి, యాదగిరి, కృష్ణ నాయక్, బల్ల సూర్య, బత్తుల బలరాం యాదవ్, కటకం రాజేష్, మోరి గాడి ఉపేందర్ గౌడ్, నామాల రవి, ఎండి జాంగిర్, బాలకృష్ణ, నరేందర్ రెడ్డి, జేఏసీ రాజశేఖర్, ఆదర్శనగర్, వెంకటేశ్వర కాలనీ, ఫ్రీడం సొసైటీ, న్యూ హేమ నగర్, గాయత్రి హిల్స్, సాయి రామ్ నగర్, వెస్ట్ బాలాజీ హిల్స్, ఆనంద్ నగర్, మెక్డోల్ కాలనీ, పద్మావతి కాలనీ, గణేష్ నగర్, కావేరి నగర్, నవోదయ కాలనీ, ఈదయ్య నగర్ తదితర కాలనీల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కాశీ యాత్ర పూర్తి చేసుకున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు పాండు

**టంగుటూరు శివాలయంలో ప్రత్యేక అభిషేక పూజలు**

**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** కుటుంబ సమేతంగా యాత్ర అనంతరం మారయ్య గుడిలో ప్రత్యేక కార్యక్రమాలు, యాత్ర విశేషాలు పంచుకున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు పాండు. శంకర్ పల్లి మండలం టంగుటూరు గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు పాండు, సోదరులు ప్రభాకర్, కుటుంబ సభ్యులతో కలిసి కాశీ యాత్ర అనంతరం స్వగ్రామానికి చేరుకుని ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. మార్చి 29, 2026న ప్రారంభమై ఏప్రిల్ 10, 2026 వరకు కొనసాగిన ఈ యాత్రను కాశీ విశ్వనాథుని దివ్య ఆశీస్సులతో విజయవంతంగా ముగించుకుని ఆదివారం రోజు స్వగ్రామానికి చేరుకున్నారు. సోమవారం ఉదయం సొంత గ్రామమైన టంగుటూరులోని అతి పురాతన మారయ్య గుడి (శివాలయం)లో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయుడు పాండు తన యాత్ర విశేషాలను కుటుంబ సభ్యులతో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు హాజరై ఆనందాన్ని పంచుకున్నారు.




# రోడ్డు ప్రమాదాల నివారణకు గ్రామ,వార్డు రోడ్డు భద్రత కమిటీలు

- ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమం
- రోడ్డు ప్రమాదాల నివారణ పై విస్తృత అవగాహన కల్పించడానికి రోడ్డు భద్రత కమిటీల ఏర్పాటు.
- గ్రామ,వార్డు రోడ్డు భద్రత కమిటీలు బాధ్యతగా పనిచేయాలి.
- ప్రతి ప్రయాణం సురక్షిత గమ్యం చేరాలి.
- డిఫెన్సివ్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తేనే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చు.
- రోడ్డు ప్రమాదంలో జీవితం అర్థాంతరం కావద్దు.
- పెద్దను కోల్పోతే కుటుంబం దిక్కులేనిది అవుతుంది.
- రోడ్డు ప్రమాదాల నిర్మూలనకు జాగ్రత్తలు పాటిస్తాం అని కమిటీలు తీర్మానాలు చేసుకోవాలి.
- సామాజిక సేవలో, ప్రజల భద్రతలో పోలీసు పటిష్టంగా పని చేస్తుంది.
- సూర్యాపేట జిల్లా ఎస్పీ కె నరసింహ ఐపిఎస్




**సూర్యాపేట,రాజముద్ర న్యూస్:** ప్రతి ప్రయాణం సురక్షిత గమ్యం చేరడం రోడ్డు ప్రమాదాలను అరికట్టడం ఏ ఒక్కరూ రోడ్డు ప్రమాదాలలో మరణించకూడదు అనే లక్ష్యంతో రాష్ట్ర పోలీస్ శాఖ డిజిపి అరైవ్ అలైవ్ అనే రోడ్డు భద్రత ఉద్యమ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని,దీనిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రజలతో భాగస్వామ్యమై రోడ్డు భద్రత పట్ల విస్తృతంగా చైతన్యవంతం చేస్తున్నామని ఎస్పీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అతి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా వారం రోజులపాటు రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము, అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత వారం రోజుల కార్యక్రమాలను సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్ నందు స్థానిక మున్సిపల్ ప్రజాప్రతినిదులతో కలిసి ప్రారంభించారు.రోడ్డు ప్రమాదాల నివారణలో బాధ్యతగా ఉంటామని సమావేశానికి హాజరైన వారితో ప్రతిజ్ఞ చేయించడం జరిగినది. ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పిస్తూ సీనియర్ సిటిజన్స్ కు కొంత మందికి హెల్మెట్ అందించారు. ఈ సందర్భంగా ఎస్పి నరసింహ ఐపిఎస్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు సంబంధించి ఏ ఒక్కరు ప్రాణాలు కోల్పోవద్దు, ప్రజల ప్రాణాలను కాపాడాలనే ఉద్దేశ్యంతో అన్ని శాఖల సమన్వయంతో రహదారి భద్రతపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. చిన్నపిల్లల నుండి వృద్ధుల వరకు రోడ్డు మీద ప్రయాణం చేసేటప్పుడు నియమ నిబంధనలు పాటించాలని ఆయన అన్నారు.జిల్లాలో చేపట్టిన రోడ్డు భద్రత అవగాహన సదస్సులు రోడ్డు ప్రమాద నివారణ చర్యల వల్ల సూర్యాపేట జిల్లాలో 2024వ రోడ్డు ప్రమాదంలో 278 మంది చనిపోతే 2025లో ఆ సంఖ్యని 230 కి తగ్గించామని అన్నారు. దేశంలో సంవత్సరానికి 150000 మందికి పైగా ఈ రోడ్డు ప్రమాదాల బారిన పడి అభ్యంతరంగా చనిపోతున్నారని తెలిపారు. జాగ్రత్తలు పాటించకుండా ప్రయాణించి రోడ్డు ప్రమాదాలు పారిన పడిన సంఘటన గుర్తు చేశారు. వాహనాలు పెరిగాయని, రోడ్ల సౌకర్యం పెరిగినది, అయితే అతివేగంతో ప్రయాణం చేయవద్దని ఆయన చెప్పారు. జిల్లాలో ప్రమాదాలు తగ్గించడానికి ప్రజల ప్రాణాలు కాపాడడానికి పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. సూర్యాపేట పట్టణంలో నివసిస్తున్న జనాభాకు 180 మంది పోలీసులతో నిరంతరం రక్షణ కల్పిస్తున్నాం, ప్రజలందరూ కూడా ఏదైనా ప్రమాదాలు గానీ నేరాలుగా జరిగినప్పుడు వారు కూడా తక్షణమే స్పందించాలని అన్నారు. ప్రజల ఆస్తులకు ,ప్రాణ రక్షణకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు.జిల్లాలో 2024 లో500 దొంగతనాలు జరిగితే ఇప్పుడు 300కి తగ్గించడం జరిగిందని అన్నారు. సీసీటీవీలు పెంచాలని సిసిటివి కెమెరాలు పెంచడం ద్వారానే సమాజంలో నేరాలని తగ్గించగలుగుతామని ఆయన అన్నారు.మహిళలపై, విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నామని తెలిపారు.మహిళా భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని అన్నారు. ప్రమాదాల నివారణకోసం డ్రైవర్లకు పోలీసుల ఆధ్వర్యంలో 1500 మందికి పైగా డ్రైవర్లకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించాం, అద్దాలు, మందులు అందించాం అన్నారు. రోడ్డు ప్రమాదాలలో దాదాపు 99 శాతం మానవ తప్పిదాల వలన జరుగుతున్నాయని, అతివేగంగా పోవడం నిర్లక్ష్యంతో డ్రైవింగ్ చేయడం, మద్యం సేవించి వాహనం నడపడం, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం, జాగ్రత్తలు పాటించకపోవడం, రాంగ్ రూట్లో వెళ్లడం వంటి వాటి వలన ప్రమాద ఎక్కువ జరుగుతున్నాయని ఆయన అన్నారు. ద్విచక్ర వాహనంపై వెళ్లేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో వెళ్లేవారు సీట్ బెల్ట్ ధరించాలని అన్నారు. జాతీయ రహదారుల మీద ఎక్కువ వేగంతో ప్రయాణించే వాహనాలు కుడి చేతి వైపు వెళ్ళాలని,, తక్కువ వేగంతో ప్రయాణించే వాహనాలు ఎడమవైపు వెళ్ళాలని, నడిచేవారు కూడా పూర్తిగా ఎడమ వైపు వెళ్లాలని ఆయన అన్నారు. లారీలు ఆర్టీసీ బస్సులు మీద లోడ్ తో వెళ్లేవారు ఎడమవైపు ప్రయాణం చేయాలని తెలియజేశారు. ఆటోలో గానీ కారులో గాని పరిమిత సంఖ్యలో ప్రయాణం చేయాలని ఎక్కువ మంది ప్రయాణించడం వలన ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ఎక్కువ మంది ప్రాణాలు పోవడం జరుగుతుందన్నారు గతంలో సూర్యాపేట జిల్లాలో పాఠశాలకు వెళ్తున్న ఉపాధ్యాయులు అతివేగంతో ప్రయాణించడం వలన వారు ప్రమాదానికి గురయ్యారని ఆయన చెప్పారు. మనము రోడ్డు ఎక్కేటప్పుడు కుడివైపు ఎడమవైపు చూసుకోవాలని అలాగే వెనుక నుంచి ఎవరు వస్తున్నారు గమనించి వాహనాన్ని నడపాలని ఆయన అన్నారు. డిఫెన్స్ డ్రైవింగ్ చేయాలి :- డిఫెన్స్ డ్రైవింగ్ అంటే వెహికల్ కండిషన్ బాగుండాలి, ఇంజన్ కండిషన్ బాగుండాలి, బ్రేకులు పనిచేస్తుందో లేదో చూసుకోవాలని, మిర్రర్స్ ఉండాలని,మనము జాగ్రత్తగా వాహనం నడపాలని అప్పుడే ప్రమాదాలు జరగకుండా ఉంటాయని చెప్పారు. సెల్ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరమని అన్నారు. ప్రతి వార్డులో కూడా వార్డు సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని తొమ్మిది మందితో ఈ కమిటీలు వేసి ఇందులో ముగ్గురు మహిళలు ఉండాలని ఆయన అన్నారు. ప్రతి కార్యాలయంలో కూడా నో హెల్మెట్ బోర్డులు పెట్టాలని ఆయన చెప్పారు. ఇప్పటికే ఎస్పీ కార్యాలయంలో ఈ నిబంధన అమలు చేస్తున్నామని ఎస్పీ అన్నారు. ప్రజాప్రతినిధులుగా కాలనీల నందు యువతను అప్రమత్తం చేసి సక్రమ మార్గంలో నడపాల్సిన బాధ్యత ఉన్నదని గాంజా ఇలాంటి మాదకద్రవ్యాలకు అలవాటు పడ్డ వారిని గుర్తించి కౌన్సిలింగ్ నిర్వహించి వారిలో మంచి ప్రవర్తన తేవాలని అన్నారు.ప్రజల రక్షణ డ్రగ్స్ నిర్మూలనలో పోలీస్ తో భాగస్వామ్యం కావాలని సూచించారు.సూర్యాపేట పట్టణ మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్మన్, కమిషనర్ మాట్లాడుతూ రోడ్డు భద్రత చర్యలకు సంబంధించి మున్సిపాలిటీ ద్వారా అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ట్రాఫిక్ సిగ్నల్ లైట్ల ఏర్పాటు ముఖ్యమైన కోడలు భద్రత చర్యలు, జీబ్రా క్రాసింగ్ లైన్లో ఏర్పాటు లాంటి అంశాలను పోలీస్ శాఖతో సమన్వయంతో పనిచేసే పూర్తి చేస్తామని తెలిపారు. పోలీసు వారు సూచిస్తున్న రోడ్డు నియమ నిబంధనలు పాటిస్తూ ప్రజలు జాగ్రత్తగా వాహనాలు నడిపి ప్రాణ రక్షణలో ఉండాలని కోరారు. మున్సిపాలిటీ వార్డులలో కమిటీలు ఏర్పాటు చేసి బాధ్యతగా రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు మున్సిపాలిటీ ద్వారా సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమం లో సూర్యాపేట మున్సిపల్ చైర్మన్ నివేదిత లక్షాది, వైస్ చైర్మన్ సేఫి ఉల్లా, డిఎస్పీ ప్రసన్న కుమార్ ఆర్టీవో జయప్రకాశ్ రెడ్డి మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి,ఆర్టీసీ డిఎం,సూర్యాపేట పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, వార్డు కౌన్సిలర్స్,స్థానిక ఎస్ఐ లు, వైద్యులు,విద్యార్థులు,పౌరులు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు హర్షణీయం




**సూర్యాపేట,రాజముద్ర న్యూస్:** నిత్యం రద్దిగా వుండె కూరగాయల మార్కెట్ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేయడం హర్షనీయమని 48 వ వార్డు కౌన్సిలర్ వెలుగు వెంకన్న అన్నారు.సోమవారం జిల్లా కేంద్రంలోని 48వ వార్డు కూరగాయల మార్కెట్ వద్ద సుధాకర్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ వారి సౌజన్యంతో సూర్యాపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది,కమీషనర్ హన్మమంతరెడ్డి,సుధాకర్ పివిసి కంపెనీ ఎండి మీలామహదేవ్ ప్రారంభించి మాట్లాడారు.ప్రస్తుతం ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో జిల్లా కేంద్రానికి వచ్చే వివిధ ప్రాంతాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రతి సంవత్సరం చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వడదెబ్బకు గురికాకుండా డిహైడ్రేషన్ కు లోను కాకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫి వుల్లా, కౌన్సిలర్ కొణతం రాజేష్, మున్సిపల్ ఇ ఇ కిరణ్, డీఇ సత్యారావు, జూనియర్ అసిస్టెంట్ ఎస్ ఎస్ ఆర్ ప్రసాద్ ,పివిసి శర్మ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ గ్రామాన రోడ్డు భద్రత పై అవగాహన గ్రామసభలు



**రామారెడ్డి రాజముద్ర న్యూస్ :** రామారెడ్డి మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలలో రోడ్డు భద్రతపై అవగాహన గ్రామసభలు గ్రామ సర్పంచుల ఆధ్వర్యంలో నిర్వహించారు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రణాళిక ప్రగతి పథంలో భాగంగా 99 రోజుల కార్యచరణను పురస్కరించుకొని ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు, సమావేశంలో రహదారి నిబంధనలు పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు, ముఖ్యఅతిథిగా పోలీస్ బృందం వచ్చి వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి జాగ్రత్తలు పాటి ంచాలని, ట్రాఫిక్ నియమాలు పాటించాలని తెలిపారు, రహదారి భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని ప్రతి పౌరుడు బాధ్యతగా భావించాలని కోరారు, గ్రామస్తులతో రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు, ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్లు, ఉప సర్పంచ్లు, గ్రామ కార్యదర్శులు, వార్డ్ మెంబర్లు, అంగన్వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, అన్ని శాఖల అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఆశలకి పోచారం అండ.. ఇళ్ల నిర్మాణంలో దూకుడు



**బాన్సువాడ, రాజముద్ర న్యూస్:** పేదల సొంతింటి కలను సాకారం చేసే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని బాన్సువాడ ఎమ్మెల్యే , ప్రభుత్వ సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సోమవారం తన స్వగృహంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని, పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,.... ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి గృహ సౌకర్యం అందేలా చూడాలని సూచించారు. నిర్మాణంలో ఎలాంటి ఆలస్యం చోటుచేసుకోకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. పనుల నాణ్యతలో రాజీ పడకుండా, నిర్దేశిత ప్రమాణాలతో ఇళ్లను నిర్మించాలన్నారు. ఇప్పటికే ప్రారంభమైన ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి, లబ్ధిదారులకు త్వరగా అందజేయాలని సూచించారు. అవసరమైన నిర్మాణ సామగ్రి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, ప్రతి దశలో పర్యవేక్షణను పెంచాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులు కూడా నిర్మాణంలో చురుకుగా పాల్గొని పనులను త్వరగా పూర్తి చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. సమస్యలు ఎదురైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. సమావేశంలో ఆగ్రో చైర్మన్ కాసుల బాలరాజ్, సబ్ కలెక్టర్ కిరణ్మయి , సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు యూనిఫాం పంపిణీ



**రామారెడ్డి రాజముద్ర న్యూస్ :** రామారెడ్డి మండలం మద్దికుంట గ్రామంలో, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పూర్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మొత్తం 14 మంది విద్యార్థులకు షూస్, యూనిఫాం, పలకలు అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మనిషా రామస్వామి, ఉప సర్పంచ్ ముత్యాల రాజు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజన్న, రమాదేవి, శ్రీకాంత్, కరుణ శ్రీ,, నాగరాణి, లావణ్య, రమ్య, బాల్ లక్ష్మి , లింగమాచారి, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## కొండకల్‌లో "ఆరైవ్ అలైవ్" కార్యక్రమం




- రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం
- మొకిలా పోలీసుల ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియమాలపై అవగాహన
- రోడ్డు ప్రమాదాల నివారణకు గ్రామంలో 9 మంది కమిటీ ఏర్పాటు

**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** శంకర్ పల్లి మండల పరిధిలోని కొండకల్ గ్రామంలో మోకిల పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో "ఆరైవ్ అలైవ్" అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు 9 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటు చేయాలనీ నిర్ణయించారు. కొండకల్ గ్రామంలో కూడా ముగ్గురు మహిళలు, ముగ్గురు పెద్దలు, ముగ్గురు యువకులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో సిఐ వీరబాబు మాట్లాడుతూ.... రోజు రోజుకు పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్ డ్రైవర్లు సీట్ బెల్ట్ ఉపయోగించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని హెచ్చరించారు. అలాగే అధిక వేగం ప్రమాదాలకు ప్రధాన కారణమని, వేగ నియంత్రణ ఎంతో అవసరమని తెలిపారు. పోలీస్ అధికారులు రోడ్డు భద్రతకు సంబంధించిన పలు సూచనలు అందిస్తూ, ట్రాఫిక్ నియమాలు పాటించడం ద్వారా మన ప్రాణాలతో పాటు, ఇతరుల ప్రాణాలను కూడా కాపాడవచ్చని వివరించారు. "ఆరైవ్ అలైవ్" కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం ప్రతి ఒక్కరూ సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవడం అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమేనని తెలిపారు. చివరగా గ్రామ ప్రజలు, పోలీసులు రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేసారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## నిఘా నేత్రాలతో నేరాలకు అడ్డుకట్ట..

- సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు, వ్యాపారులు ముందుకు రావాలి..
- ప్రజల రక్షణలో పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుంది...
- నేరాల నివారణలో ప్రజలు భాగస్వామి కావాలి...

**సూర్యాపేట, రాజముద్ర న్యూస్:** సూర్యాపేట పట్టణం పోలీస్ స్టేషన్ నందు 75 సీసీ కెమెరాలు అనుసంధానంతో ఏర్పాటుచేసిన కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ జిల్లా ఎస్పీ నరసింహ,సూర్యాపేట మున్సిపల్ చైర్ పర్సన్,మున్సిపల్ వైస్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ సూర్యాపేట డిఎస్పి, ఆర్టీవో, సూర్యాపేట పట్టణ ఇన్స్పెక్టర్ లతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేరాల నివారణ,నేరాల నియంత్రణ,నేరాల చేదనలో సీసీ కెమెరాలు ప్రాధాన్యత చాలా ఉన్నదని సీసీ కెమెరాలు ఏర్పాటుకు ప్రజలు వ్యాపారస్తులు ముందుకు రావాలని నేరాల నివారణలో భాగస్వామ్యం కావాలని కోరారు అభివృద్ధిలో రోజురోజుకు పురోగతి చెందుతున్న సూర్యాపేట జిల్లా కేంద్రంలో ప్రజల భద్రతకు సూర్యాపేట పోలీస్ కట్టుబడి ఉందని నిరంతర అన్నిగా ఉంచి ప్రజలకు పోలీస్ సేవలను చేరువ చేస్తున్నాను తెలిపారు.భద్రతా చర్యల్లో భాగంగా సూర్యాపేట పట్టణంలో 75 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని నిత్యం పర్యవేక్షణ చేయటానికి పట్టణ పోలీస్ స్టేషన్ కు అను సంధానం చేసి కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ను ఏర్పాటు చేయడం జరిగింద న్నారు. సీసీటీవీ కెమెరాల నిఘాలతో నేరాలను అరికట్టవచ్చని తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే రక్షణగా నిలుస్తా యని ఒక్కో సిసి కెమెరా 100 నేత్రాలతో వంద మంది పోలీసులతో సమానమని అన్నారు. పట్టణంలో మరింత రక్షణ కల్పించడానికి సీసీ కెమెరాలు ఆధునికరిస్తున్నా మని ఎక్కువ మొత్తంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తామని ఈ దిశగా ప్రజలను వ్యాపారము అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.సీసీ కెమెరాల ఏర్పాటుకు స్థానిక ప్రజలు వ్యాపారులు ముందుకు రావాలని నేరాల నివారణలో భాగస్వామ్యం కావాలని కోరారు. కమాండ్ అండ్ కంట్రోల్స్ సెంటర్ ప్రారంభోత్సవం నందు సూర్యాపేట మున్సిపాలిటీ చైర్మన్ నివేదిత, వైస్ చైర్మన్ షఫీ ఉల్లా,సూర్యాపేట డిఎస్పి ప్రసన్నకుమార్,ఆర్టీవో జయప్రకాశ్ రెడ్డి,మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, సూర్యాపేట పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# మహిళల టీ20 వరల్డ్ కప్‌కు భారీ ప్రైజ్ మనీ..

## ఐసీసీ ప్రకటన

**ఢిల్లీ:** మహిళల టీ20 ప్రపంచ కప్ 2026 టోర్నీ కోసం అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) రికార్డు స్థాయి ప్రైజ్ మనీని ప్రకటించింది. గత 2024 ఎడిషన్‌తో పోలిస్తే ఈసారి నగదు బహుమతిని దాదాపు 10 శాతం పెంచినట్లు వెల్లడించింది. 2024 ఎడిషన్‌లో మొత్తం 7,958,077 డాలర్లు (రూ.70 కోట్లకు పైగా) ప్రైజ్ మనీగా ఉండగా, 2026 మహిళల టీ20 వరల్డ్ కప్ కోసం మొత్తం ప్రైజ్ పూల్‌ను 8,764,615 డాలర్లు (సుమారు రూ.81 కోట్లు)గా నిర్ణయించినట్లు ఐసీసీ తెలిపింది. టోర్నీలో విజేతగా నిలిచిన జట్టుకు రూ.21.8 కోట్లు, రన్నరప్ జట్టుకు రూ.10 కోట్లు అందించనున్నారు. సెమీఫైనల్లో ఓడిన జట్లకు చెరో రూ.6 కోట్లు ఇవ్వనున్నారు. గ్రూప్ దశలో గెలిచిన ప్రతి మ్యాచ్‌కు జట్లకు రూ.29 లక్షలు చెల్లించనున్నారు. అలాగే టోర్నీలో పాల్గొనే ప్రతి జట్టుకు కనీస హామీగా రూ.2.3 కోట్లు ఇవ్వాలని నిర్ణయించారు. జూన్ 12 నుంచి ప్రారంభమయ్యే ఈ మహిళల టీ20 వరల్డ్ కప్ టోర్నీలో మొత్తం 12 జట్లు పోటీపడనున్నాయి.

# అమన్, ముకుల్ వెండి పట్టు



**బిష్కెక్:** ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత యువ రెజ్లర్లు అమన్ సెహ్రావత్, ముకుల్ దహియా రజత పతకాలతో మెరిశారు. ఆదివారం జరిగిన పురుషుల 61కిలోల కేటగిరీ ఫైనల్లో అమన్ 10-13తో క్యాంగ్ ముయాంగ్ కిమ్(కొరియా) చేతిలో పోరాడి ఓడాడు. మరోవైపు పురుషుల 86కిలోల తుది పోరులో ముకుల్ 0-7తో కమ్రాన్ జీ గసెమ్‌పోర్(ఇరాన్)పై ఓటమిపాలయ్యాడు.

# ఆయూష్‌కు రజతం..

## ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్



**నింగ్బో(చైనా):** ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత యువ షట్లర్ ఆయూష్ శెట్టి రజత పతకంతో మెరిశాడు. టోర్నీ ఆద్యంతం అద్భుత ప్రదర్శనతో సత్తాచాటిన ఆయూష్‌కు ఫైనల్లో నిరాశ ఎదురైంది. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో ఆయూష్ 8-21, 10-21తో షి యు కి(చైనా) చేతిలో ఓడి రన్నరప్‌తో సరిపెట్టుకున్నాడు. సెమీస్‌లో ప్రపంచ నంబర్‌వన్ షట్లర్ కునాల్వుత్ విదిత్సరన్‌ను చిత్తుచేసి తుదిపోరుకు అర్హత సాధించిన ఈ 20 ఏండ్ల యువ షట్లర్ అదే పోరాట పటిమ కనబర్చలేకపోయాడు. దీంతో గత ఆరు దశాబ్దాలుగా టోర్నీలో పసిడి పతకం కోసం భారత్ నిరీక్షణ ఇంకా కొనసాగుతూనే ఉన్నది. దినేశ్ కన్నా తర్వాత ఫైనల్ చేరిన రెండో భారత షట్లర్‌గా నిలిచిన ఆయూష్ కొత్త చరిత్ర లిఖించే అవకాశాన్ని చేజార్చుకున్నాడు. 42 నిమిషాల్లోనే ముగిసిన పోరులో చైనీస్ షట్లర్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించాడు. షి యు కి..ఆయూష్‌కు ఏమాత్రం అవకాశమివ్వకుండా వరుస గేముల్లో మ్యాచ్‌ను తన సొంతం చేసుకున్నాడు.



# సొంతగడ్డపై సన్ రైజర్స్ గర్జన


- విధ్వంసం సృష్టించిన ఓపెనర్ ఇషాన్ కిషన్ (91)
- 159 పరుగులకే కుప్పకూలిన రాజస్థాన్ రాయల్స్
- చెరో 4 వికెట్లతో అదరగొట్టిన హుస్సేన్, ప్రఫుల్ హింగే
- రాజీవ్ గాంధీ స్టేడియంలో హోరెత్తిన అభిమానులు

**57 పరుగుల తేడాతో ఎస్ఆర్హెచ్ ఘన విజయం**

**హైదరాబాద్, ఏప్రిల్ 13 (మనసులో మాట):** ఐపీఎల్ లో సన్ రైజర్స్ హైదరాబాద్ సత్తా చాటింది. బౌలింగ్, బ్యాటింగ్ రెండు విభాగాల్లోనూ సమష్టి కృషితో అదరగొట్టి భారీ విజయాన్ని నమోదు చేసింది. సోమవారం రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా జరిగిన లీగ్ మ్యాచ్ లో రాజస్థాన్ రాయల్స్ పై 57 పరుగుల తేడాతో ఎస్ఆర్హెచ్ ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ లో ఇషాన్ కిషన్ వీరవిహారం చేయగా.. ఆ తర్వాత బౌలింగ్ లో సాకిబ్ హుస్సేన్, ప్రఫుల్ హింగే నిప్పులు చెరిగారు. అన్ని విభాగాల్లోనూ ఆధిపత్యం చెలాయించిన హైదరాబాద్ జట్టు రాజస్థాన్ కు కోలుకోలేని షాక్ ఇచ్చింది.



## ఉప్పెనలా ఇషాన్ కిషన్



టాస్ గెలిచిన రాజస్థాన్ రాయల్స్ ముందుగా బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ కు దిగిన సన్ రైజర్స్ హైదరాబాద్ కు ఓపెనర్ ఇషాన్ కిషన్ అదిరిపోయే ఆరంభాన్నిచ్చాడు. రాజస్థాన్ బౌలర్లను ఊచకోత కోస్తూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. కేవలం 44 బంతుల్లోనే 91 పరుగులు చేసి తృటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. అతనికి జతగా హెన్రిచ్ క్లాసెన్ 26 బంతుల్లో 40 పరుగులతో రాణించాడు. చివర్లో నితీష్ కుమార్ రెడ్డి కేవలం 13 బంతుల్లో 28 పరుగులు చేసి మెరుపులు మెరిపించాడు. దీంతో నిర్ణీత 20 ఓవర్లలో హైదరాబాద్ 6 వికెట్ల నష్టానికి 216 పరుగుల భారీ స్కోరు సాధించింది. రాజస్థాన్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్ 2 వికెట్లు తీయగా, రియాన్ పరాగ్, సందీప్ శర్మ తలో వికెట్ పడగొట్టారు. సందీప్ శర్మ 4 ఓవర్లలో ఏకంగా 52 పరుగులు సమర్పించుకోవడం గమనార్హం.

## కుప్పకూలిన రాజస్థాన్

217 పరుగుల కఠిన లక్ష్యంతో బరిలోకి దిగిన రాజస్థాన్ రాయల్స్ కు ఆదిలోనే సన్ రైజర్స్ బౌలర్లు చుక్కలు చూపించారు. పదునైన బంతులకు రాజస్థాన్ బ్యాటర్లు విలవిలలాడారు. డొనొవన్ ఫెరీరా 44 బంతుల్లో 69 పరుగులతో ఒంటరి పోరాటం చేశాడు. అతనికి తోడుగా రవీంద్ర జడేజా 32 బంతుల్లో 45 పరుగులతో రాణించినా లాభం లేకపోయింది. చివర్లో తుషార్ దేశ్ పాండే 11 బంతుల్లో 25 పరుగులతో పోరాడే ప్రయత్నం చేశాడు. మిగతా బ్యాటర్లంతా ఘోరంగా విఫలం కావడంతో రాజస్థాన్ 19 ఓవర్లలో 159 పరుగులకే ఆలౌట్ అయింది.



# ఐపీఎల్‌కు ఎన్నికల సెగ

## ఆ రెండు మ్యాచ్‌ల షెడ్యూల్ మార్పు

**అహ్మదాబాద్ :** ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌కు మరోసారి ఎన్నికల సెగ తగిలింది. నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల కారణంగా షెడ్యూల్‌ను ఆసల్యంగా ప్రకటించిన భారత క్రికెట్ నియంత్రణ మండలి ఈసారి మ్యాచ్ వేదికల్లో మార్పులు చేసింది. మాజీ ఛాంపియన్లు గుజరాత్ టైటాన్స్, చెన్నై సూపర్ కింగ్స్ మ్యాచ్ వేదకలను మార్చింది. అహ్మదాబాద్‌తో పాటు గుజరాత్‌లోని పలు చోట్ల మున్సిపల్ ఎన్నికలు ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు బీసీసీఐ వెల్లడించింది. భారీ స్కోర్ల మ్యాచ్‌లు, ఉత్కంఠ పోరాటాలతో అలరిస్తున్న పంతొమ్మిదో సీజన్ ఐపీఎల్ షెడ్యూల్ మారనుంది. ప్లే ఆఫ్స్ రేసు ఆసక్తికరంగా మారిన వేళ.. కీలక మ్యాచ్‌ల వేదికలను మార్చింది బీసీసీఐ. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 26న .. అహ్మదాబాద్ స్టేడియంలో గుజరాత్ టైటన్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్లు తలపడాలి. అయితే.. గుజరాత్ వ్యాప్తంగా అదే రోజున మున్సిపల్ ఎన్నికలు ఉన్నందున.. వేదికను చిదంబరం స్టేడియానికి మార్చింది బీసీసీఐ. చెపాక్ వేదికగా మధ్యాహ్నం 3:30 గంటలకు గుజరాత్, చెన్నై మ్యాచ్ జరుగనుంది. అలానే మే 21న చెన్నై సొంత మైదానంలో ఇరుజట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్‌ను అహ్మదాబాద్‌కు తరలించారు.






# ‘చిరంజీవి’ ఫస్ట్ లుక్ విడుదల..

## కొత్త కాన్సెప్ట్‌తో రాబోతున్న చిత్రం

కికు యనమల, కశిష్ ఖాన్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న ‘చిరంజీవి’ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ తాజాగా విడుదలైంది. మెగా బ్రదర్ నాగబాబు చేతుల మీదుగా ఈ పోస్టర్ లాంచ్ చేయగా, చిత్రబృందం ఆయనకు ధన్యవాదాలు తెలిపింది. డెక్స్ట్రోకార్డియా అనే అరుదైన పరిస్థితి నేపథ్యంలో ఈ చిత్రం రూపొందుతోంది. గుండె కుడి వైపున ఉండే సమస్యతో జీవించే యువకుడి కథను ఆసక్తికరంగా, ప్రేరణాత్మకంగా చూపించనున్నారు. తనికెళ్ల భరణి, ఈశ్వరీ రావు, గోపరాజు రమణ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని సాయి వెంకట్ తెరకెక్కిస్తున్నారు. కికు ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై దీప్తి నడిమింటి నిర్మిస్తున్నారు. వేసవి విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే వెల్లడించనున్నారు.



# పాలక్ ఫ్యాన్స్‌కు ట్రీట్..

## ఫొటోషూట్లతో ఆకట్టుకుంటున్న చిన్నది

యువ నటి పాలక్ తాజా ఫొటోషూట్లతో అభిమానులకు ప్రత్యేక ట్రీట్ ఇస్తోంది. స్టైలిష్ లుక్స్‌తో వరుసగా ఫొటోలు షేర్ చేస్తూ సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారుతోంది. ప్రతి ఫొటోలో కొత్త స్టైల్‌ను చూపిస్తున్న పాలక్, గ్లామర్‌తో పాటు ఎలిగెన్స్‌ను కూడా బ్యాలెన్స్ చేస్తోంది. ఆమె లుక్స్‌కు నెటిజన్ల నుంచి మంచి స్పందన వస్తోంది. సినిమాల్లో అవకాశాలు అందిపుచ్చుకుంటూ ముందుకు సాగుతున్న ఈ బ్యూటీ, సోషల్ మీడియాలోనూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటోంది. ఫొటోషూట్లతోనే కాకుండా తన స్టైల్‌తో కూడా ట్రెండ్ సెట్ చేస్తోంది.




# మిస్టికల్ థ్రిల్లర్ జానర్‌లో ‘పోచమ్మ’..

## ఆహాలో ట్రైలర్ విడుదల

తెలుగు ఓటీటీ ప్లాట్‌ఫామ్ ఆహా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్న తాజా వెబ్ సిరీస్ ‘పోచమ్మ’ మిస్టికల్ థ్రిల్లర్‌గా ఆకట్టుకోబోతోంది. అంబటి అర్జున్, శ్రీ పూజా రెడ్డి, స్నేహా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సిరీస్ ఈ నెల 17 నుంచి స్ట్రీమింగ్ కానుంది. గోల్డ్ సబ్‌స్క్రైబర్లకు ముందుగానే వీక్షణ అవకాశం కల్పించనున్నారు. ఇటీవల విడుదలైన ట్రైలర్ ఆసక్తిని పెంచుతోంది. అడవులతో నిండిన ప్రశాంత వాతావరణంలో ఉన్న ఓ ఇంటి చుట్టూ కథ నడుస్తుంది. ఆ ఇంటి ముందు పోచమ్మ తల్లికి గుడి ఉండగా, ఆ ప్రాంతాన్ని దేవత కాపాడుతుందనే నమ్మకంతో కథ ముందుకు సాగుతుంది. గుడిని, విగ్రహాన్ని తొలగించేందుకు ప్రయత్నించిన వారిపై పోచమ్మ తల్లి ఎలా ప్రతీకారం తీర్చుకుంటుందనే అంశాన్ని ట్రైలర్‌లో రోమాంచకంగా చూపించారు. ఇదే సమయంలో ఒక యువ జంట ప్రేమకథ, వారి జీవితంలో ఎదురయ్యే అడ్డంకులను కూడా హైలైట్ చేశారు. డివైన్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ కలగలిపిన ఈ సిరీస్ ట్రైలర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. శ్రుతి నాయుడు నిర్మాణంలో, రమేష్ ఇంద్ర దర్శకత్వంలో రూపొందిన ‘పోచమ్మ’పై ఆసక్తి రోజురోజుకు పెరుగుతోంది.





# పసిడి కాంతుల్లో మెరుస్తున్న ప్రిషా సింగ్

యువ నటి ప్రిషా సింగ్ తాజా ఫొటోలతో సోషల్ మీడియాలో ఆకట్టుకుంటోంది. పసుపు రంగు చీరలో సంప్రదాయ లుక్‌లో కనిపించిన ఆమె, సింపుల్‌గా ఉండి కూడా స్టైలిష్‌గా మెరిసింది. “నజ్రేన్ సంభాల్ కే... ఆదత్ లగ్ జాతీ హై” అనే క్యాప్షన్‌తో ఈ చిత్రాలను షేర్ చేసిన ప్రిషా, తన లుక్‌తో నెటిజన్ల నుంచి ప్రశంసలు అందుకుంటోంది. హిందీ, తెలుగు చిత్రాల్లో అవకాశాలు అందిపుచ్చుకుంటూ ముందుకు సాగుతున్న ఆమె, ‘గులాబో సితాబో’, ‘స్పై’, ‘బడ్డీ’ వంటి సినిమాలతో గుర్తింపు పొందింది. సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉంటూ, తన ఫ్యాషన్‌తో ట్రెండ్ సెట్ చేస్తోంది.

# ఎస్క్వైర్ కవర్‌పై మెరిసిన రామ్ చరణ్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ అంతర్జాతీయ స్థాయిలో మరోసారి తన ప్రత్యేకతను చాటుకున్నారు. ప్రముఖ అంతర్జాతీయ మ్యాగజైన్ ‘ఎస్క్వైర్ ఇండియా’ కవర్ పేజీపై మెరిసి అభిమానులను ఆనందపరిచారు. భారతీయ సినిమాకు గర్వకారణంగా నిలిచిన నటుడిగా, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన స్టార్‌గా మ్యాగజైన్ ఆయనను ప్రశంసించింది. ఈ కవర్ ఫోటోలో రామ్ చరణ్ సరికొత్త స్టైలిష్ లుక్‌లో కనిపిస్తూ ఆకట్టుకున్నారు. రాయల్, కమాండింగ్ లుక్‌తో ఆయన ఫొటోషూట్ ప్రత్యేకంగా నిలిచింది. ఈ షూట్ కోసం చరణ్ హాంకాంగ్ వెళ్లినట్లు సమాచారం. ఈ ఫోటోషూట్‌లో ఆయన పెట్ డాగ్ ‘రైమ్’ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రస్తుతం బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ‘పెద్ది’ సినిమాలో నటిస్తున్న చరణ్, ఆ సినిమా కోసం పెంచుకున్న హెయిర్ స్టైల్, గడ్డంతోనే ఈ షూట్‌లో కనిపించారు. దీంతో ‘పెద్ది’లో ఆయన లుక్‌పై అభిమానుల్లో మరింత ఆసక్తి పెరిగింది. ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, మెగా అభిమానులు వాటిని పెద్ద ఎత్తున షేర్ చేస్తున్నారు. ఒకవైపు సినిమాలతో బిజీగా ఉంటూనే, మరోవైపు అంతర్జాతీయ బ్రాండ్లకు అంబాసిడర్‌గా ఎదుగుతున్న రామ్ చరణ్ గ్లోబల్ స్థాయిలో తన స్థాయిని మరింత బలపరుచుకుంటున్నారు.

Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,**
Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com